PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 219 | విజయవాడ, గురువారం 14 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 14 March 2024 | Rs




16న బహిరంగ సభను విజయవంతం చేయాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



కాంగ్రెస్ ఆధ్వర్యాన ఈ నెల 16వ తేదీన ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించే విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ జిల్లా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి 1126వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎల్ఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై డిక్లరేషన్ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కార్మికులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను నెలల తరబడి తాత్సారం చేసినా కార్మికులు అంకితభావంతో పని చేస్తూనే ఉత్పత్తిని సాధిస్తున్నారని తెలిపారు. యాజమాన్యం కంపెనీని సమర్థవంతంగా నడపకుండా అధికారులు, కార్మికుల పట్ల భిన్నంగా వ్యవహరిస్తూ ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీస్తోందని, ఇది సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి నరేంద్ర, ఎం త్రినాథ్, కె భాస్కర్ పి సీతారామరాజు, ఎల్‌వి రమణ, ఎ రాము, డి సత్యనారాయణ, బి నాగరాజు, మంగ వెంకటరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఎమ్‌డి పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోషల్ మీడియా ద్వారా దాడి సాధారణ ప్రజలపైనే కాదు సీనియర్ ఐపిఎస్‌లనూ వదలడం లేదు. ఎవరైతే మాకేంటని ఏకంగా ఐపిఎస్‌ల పేర్లమీదనే నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలను తెరవడం చర్చనీయాంశమైంది. సీనియర్ ఐపిఎస్ అధికారి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు పేరుతో ఆయన ఫొటోను వినియోగించి నకిలీ ఫేస్‌బుక్ ఖాతాను ఏర్పాటుచేశారు. సమాచారం తెలుసుకున్న ద్వారకా తిరుమలరావు బుధవారం విజయవాడలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు వ్యక్తిగతంగా ఎలాంటి సోషల్ మీడియా ఖాతాలు లేవని, తన పేరుతో వచ్చే పోస్టులకు ఎవరూ స్పందించవద్దని ఆయన కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎలాంటి ఒత్తిళ్లకు లొంగొద్దు గెలుపే లక్ష్యంగా పనిచేయండి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కక్షసాధింపులు, అరాచకాలను నమ్ముకున్న పార్టీతో పోరాడుతున్నామనే అంశాన్ని ఎవరూ విస్మరించవద్దని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా గెలుపే లక్ష్యంగా పని చేయాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. బుధవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ తరపున ఇప్పటికే ప్రకటించిన ఆరుగురు అభ్యర్థులతో పాటు, పార్టీముఖ్యనేతలతో పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా అడ్డదారుల్లో గెలవాలని వైఎస్సార్ కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ అన్నారు. తెలుగుదేశం, బిజెపి శ్రేణులతో సమన్వయం చేసుకొని జగన్‌మోహన్‌రెడ్డి అరాచకాలకు చరమగీతం పాడాలని కోరారు. అధికారపార్టీ నుండి ఎలాంటి సమస్య ఎదురైనా పార్టీ కేంద్రకార్యాలయానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి జనసేన కార్యకర్త గెలిచి తీరాలి అనే లక్ష్యంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు కందుల దుర్గేష్, పంతం నానాజి, ఆరణి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూతురిని హతమార్చిన తండ్రి

ప్రజాశక్తి - మంత్రాలయం

అల్లారుముద్దుగా పెంచుకున్న కన్న కూతురిని కర్కశంగా హతమార్చాడు ఓ కసాయి తండ్రి. దంపతుల మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో మానవత్వాన్ని మరచి ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గ పరిధి కోసిగి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. జంపాపురం గ్రామానికి చెందిన ఖగ్గల్ శాంతకుమార్, ఆశీర్వాదమ్మకు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె హర్షిత (18 నెలలు) ఉన్నారు. పెళ్లయిన నాటి నుంచి దంపతులు తరుచూ గొడవ పడుతూ ఉండేవారు. మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి శాంతకుమార్ పక్కనే ఉన్న గుడిసెలోకి తన కూతురిని తీసుకెళ్లి గొంతుకోసి హతమార్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

సిఎఎపై మీ వైఖరేంటి?

- వైసిపి, టిడిపి, జనసేనలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సూటి ప్రశ్న
- అమలు చేయబోమని వైసిపి ప్రభుత్వం ప్రకటించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముస్లిమ్ మైనార్టీల ఉనికిని దెబ్బకొట్టి వారి భవిష్యత్‌ను అంధకారం చేస్తున్న సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం) రూల్స్ నోటిఫై చేసి దేశాన్ని ప్రమాదంలోకి నెట్టిన బిజెపి కుతంత్రాలపై రాష్ట్రంలో వైసిపి టిడిపి జనసేన పార్టీలు ఎందుకు నోరెత్తడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సిఎఎ అమలు చేయబోమని వైసిపి ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మైనార్టీలను ఉద్ధరిస్తానని రోజూ రాగాలు తీసే సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. సిఎఎ ద్వారా ముస్లిమ్ మైనార్టీల ఉనికిని దెబ్బతీయడంలో బిజెపిని బలపరిచిన తెలుగుదేశం పార్టీది నేరం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మైనార్టీలపై మెజార్టీ మతస్తులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలను సృష్టించాలనుకున్న బిజెపితో కలిసి తెలుగుదేశం లౌకికవాదం ఎలా కాపాడుతుందని ప్రశ్నించారు. బిజెపి దురాగతాలను ప్రశ్నించకుండా వైసిపి మైనార్టీలను ఎలా రక్షిస్తుందో చెప్పాలన్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం కులం, మతం, రంగు, జాతి, ప్రాంతం, భాష అధారంగా ఎవరిపట్ల వివక్ష ఉండకూడదని, కానీ సిఎఎ మత ప్రాతిపదికన వివక్ష పాటిస్తోందని తెలిపారు. రాజ్యాంగంలోని 19వ అధికరణం మతపరమైన స్వేచ్ఛ ఇస్తున్నప్పుడు ముస్లిములకు తప్ప ఇతరులకు పౌరసత్వం ఇస్తామని చెప్పడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. దశాబ్దాలుగా మతమపరమైన హింసను ఎదుర్కొన్న శ్రీలంక హిందువులను ఎందుకు మినహాయించారని ప్రశ్నించారు. పొరుగుదేశాల్లో మతపరమైన హింసకు గురవుతున్న ప్రజలను మానవతా దృష్టితో ఆదుకునేందుకే ఈ చట్టం తెచ్చినట్లయితే కేవలం మూడు దేశాలకే ఎందుకు పరిమితం చేయాల్సి వచ్చిందో తెలపాలని పేర్కొన్నారు. మయన్మార్‌లో మైనార్టీలైన రొహింగ్యా ముస్లిములు, శ్రీలకంలో హిందువులు,క్రైస్తవ తమిళులు తీవ్రమైన హింసాకాండకు గురయ్యారని వారిని ఎందుకు ఈ చట్టంలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నిస్తే కేంద్ర పభుత్వం వద్ద సమాధానం లేదని పేర్కొన్నారు. చివరకు పాకిస్తాన్ ముస్లిములతో అనేక మైనార్టీ తెగలు తీవ్రమైన హింసాకాండకు గురవుతున్నాయని, బిజెపి మానవతా జాబితాలో వారిని ఎందుకు చేర్చలేదో చెప్పాలని డిమాండు చేశారు. వీటన్నిటినీ పరిశీలిస్తే దీనివెనుక మానవత లేదని, రాజకీయవ్యూహంతో ఇదంతా చేస్తోందని అర్థమవుతుందని పేర్కొన్నారు. వామపక్షాల మద్దతుతో ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే సిఎఎ అమల్లోకి రాదని, అదే మైనార్టీలకు రక్ష, మత సామరస్యానికి గ్యారంటీ అని శ్రీనివాసరావు తెలిపారు.



సఫాయి కార్మికులకు ఆయుష్మాన్ భారత్ కిట్లు పంపిణీ చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

నెల్లూరులో గవర్నర్ నజీర్

పిఎం సూరజ్ జాతీయ పోర్టల్ ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా పర్యటనలో గవర్నర్ అబ్దుల్ నజీర్ బిజీబిజీగా గడిపారు. బుధవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లూరు చేరుకున్న ఆయనకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ స్రవంతి స్వాగతం పలికారు. అక్కడ నుంచి స్థానిక కస్తూర్బా కళా క్షేత్రంలో జరిగిన పిఎం సూరజ్ జాతీయ పోర్టల్‌ను గవర్నర్ ప్రారంభించారు. సఫాయి కర్మచారి లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద హెల్త్ కార్డులు, కిట్లు పంపిణీ చేశారు. వివిధ పథకాల అమలుకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో విజయవాడకు తిరుగు ప్రయాణం అయ్యారు. గవర్నర్ రాక సందర్భంగా నెల్లూరులో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

నేడు టిడిపి రెండో జాబితా

- 25 అసెంబ్లీ, 8 ఎంపిలతో ప్రకటన!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అభ్యర్థుల రెండో జాబితా గురువారం విడుదల కానుంది. ప్రకటించే స్థానాలపై పార్టీ అధినేత చంద్రబాబు కసరత్తు పూర్తి చేశారు. పొత్తులో భాగంగా జనసేన-బిజెపితో సంబంధం లేని స్థానాలను ప్రకటించే అవకాశం ఉంది. పొత్తులో భాగంగా టిడిపి 144 స్థానాల్లో పోటీ చేయనుంది. ఇందులో ఇప్పటికే 94 స్థానాలకు జనసేనతో కలిసి తొలి జాబితా విడుదల చేశారు. మరో 50 స్థానాల్లో టిడిపి తన అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అదే విధంగా 17 లోక్‌సభ స్థానాల్లోనూ అభ్యర్థులను వెల్లడించాల్సి ఉంది. రెండో జాబితాలో 25 శాసనసభ, 8 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను వెల్లడించనున్నట్లు సమాచారం. శాసనసభ జాబితాలో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డిని, నెల్లూరు జిల్లా కొవ్వూరుకు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, రాజమండ్రి రూరల్ అభ్యర్థిగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి, దెందులూరు చింతమనేని ప్రభాకర్ పేర్లను ప్రకటించే అవకాశం ఉంది. వీటితోపాటు మైలవరం, పెనమలూరు, సర్వేపల్లి, గుంతకల్లు, పెదకూరపాడు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. శ్రీకాకుళం, గుంటూరు, విజయవాడ, నెల్లూరు, ఒంగోలు, కర్నూలు, విశాఖపట్నం, చిత్తూరు స్థానాలను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు.

చట్టాలు చేయాలని ఉత్తర్వులివ్వలేం : హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి

హైదరాబాద్‌ను మరో పదేళ్ల పాటు ఎపి, తెలంగాణకు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా కేంద్రానికి ఉత్తర్వులు జారీ చేయాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. ఆ మేరకు చట్టం చేసేలా ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. చట్టాలు చేయాలని కోర్టులు ఉత్తర్వులు ఇవ్వలేవని తేల్చి చెప్పింది. పార్లమెంటు ఏ చట్టాలు చేయాలో కోర్టులు ఆదేశాలు జారీ చేయబోవని స్పష్టం చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. ఎపి, తెలంగాణ మధ్య ఆస్తులు, అప్పుల విభజన ఇంకా పూర్తి కానందును మరో పదేళ్లపాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా కేంద్రం చట్టం చేసేలా ఉత్తర్వులివ్వాలంటూ కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన ప్రజా సంక్షేమ సేవా సంఘం కార్యదర్శి పొదిలి అనిల్ కుమార్ వేసిన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది.

గీతాంజలి కుటుంబానికి న్యాయం చేయాలి

- ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్
- బాధిత మహిళలు, బాలికలందరికీ ఇదే తరహా సాయం అందించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెనాలిలో ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మహత్యాయత్నం చేసి రైలు యాక్సిండెంట్‌లో చనిపోయిన గీతాంజలికి ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, రమాదేవి సంతాపం ప్రకటించారు. సోషల్ మీడియాలో మాట్లాడిన గీతాంజలి ట్రోలింగ్‌కు గురై చనిపోయినట్లు వార్తలు వచ్చాయని, ఆమెను కావాలని మరణానికి గురిచేశారన్న వార్తలూ వచ్చాయని తెలిపారు. ఆమె మరణంపై నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ట్రోలింగ్ చేసిన నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే మహిళా సంఘాల నాయకులు, రాజకీయాల్లో పాల్గొంటున్న మహిళలు పెద్దయెత్తున ట్రోలింగ్‌కు గురవుతున్నారని తెలిపారు.

దానికి కారణమైన వారిపై కేసులు పెట్టడంగానీ, శిక్షించగడంగానీ జరగడం లేదని పేర్కొన్నారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని బూతులు తిడుతున్న దుష్టశక్తులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా పోలీసు అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గీతాంజలి కుటుంబానికి రూ.20 లక్షలు పరిహారం, పునరావాసం కల్పించడాన్ని ఐద్వా తరపున స్వాగతించారు. అలాగే ఎంతోమంది దారుణ హత్యలకు గురై సాయం కోసం ఎదురుచూస్తున్నారని, వారందరికీ న్యాయం చేయాలని కోరారు. అరకు మండలంలో చొంపి గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై గంజాయి మత్తులో ఉన్న యువకుడు అత్యాచారం చేశాడని, ఇంతవరకు ఆ కుటుంబానికి ఎటువంటి సాయమూ లభించలేదని పేర్కొన్నారు. తెనాలిలో ఒక పాప తండ్రి చేతిలో హత్యాయత్నాన్ని ఎదుర్కొని బతికిందని అన్నారు. తల్లి, చెల్లిని చంపేశాడని, ఆ పాపకు కూడా సాయం అందలేదని వివరించారు. ప్రభుత్వం బాధిత మహిళల విషయంలో అన్ని సందర్భాల్లోనూ వేగంగా స్పందించి పునరావాసం సాయం చేయాలని కోరారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అధ్యాపక సంఘాల నాయకులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,200 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయడానికి ప్రభుత్వం చట్టం చేయడంతోపాటు జిఓ కూడా విడుదల చేసిందని తెలిపారు. జూనియర్ కళాశాలల్లో 3,600 మంది, పాలిటెక్నిక్ కళాశాలల్లో 309 మంది, డిగ్రీ కళాశాలల్లో 670 మంది చొప్పున 4,600 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారని వివరించారు. వీరిలో ఒక్కరిని కూడా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదని పేర్కొన్నారు. నోటిఫికేషన్లు లేవని, మంజూరు పోస్టుల్లో నియామకాలు జరగలేదని, గ్యాప్ పీరియడ్‌లు, రోస్టర్ లేదని తదితర కారణాలతో ఆలస్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జవహర్‌రెడ్డితో పాటు పాఠశాల ఇంటర్మీడియట్ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, సాంకేతిక విద్య కమిషనరు నాగరాణి, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావును కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సురేష్, శ్రీనివాస్, రత్నకుమారి, స్వాతి, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల విషయంలో జోక్యం చేసుకోం

- ఆ విషయంపై నిర్ణయం ఎన్నికల సంఘానిదే
- గత ప్రభుత్వంపై సిఎం విమర్శలు తప్పుకాదు: హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఎన్నికల విధుల్లో వలంటీర్లను వినియోగించుకోవాలా? వద్దా అనే విషయంలో తాము జోక్యం చేసుకోజాలమని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సింది ఎన్నికల సంఘం (ఇసి) అని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం తేల్చి చెప్పింది. అలాగే పల్నాడు జిల్లాలో గ్రామ, వార్డు వలంటీర్ల అవార్డుల ప్రదాన సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్పుకాబోదని కూడా పేర్కొంది. పల్నాడు సభలో సిఎం ప్రసంగిస్తూ ప్రతిపక్ష నేత చంద్రబాబును విమర్శించారని, అందువల్ల ఆయన ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా పరిగణించి సభకు అయిన ఖర్చును రాబట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను బెంచ్ డిస్మిస్ చేసింది. సిఎం ప్రసంగంలో తప్పేముందని పిటిషనరును నిలదీసింది. ప్రసంగం చట్ట వ్యతిరేకంగా ప్రకటించాలని కోరడం పట్ల ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను, ప్రస్తుత వలంటీరు వ్యవస్థను సిఎం పోల్చి ప్రసంగించడంలో తప్పు ఎలా అవుతుందని నిలదీసింది. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచేలా ఇసికి ఉత్తర్వులు ఇవ్వాలంటూ ప్రకాశం జిల్లా, అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి సింగయ్య పిల్ దాఖలు చేశారు. ఇందులోనే పల్నాడు జిల్లాలో వలంటీర్ల వ్యవస్థ-జన్మభూమి కమిటీలను పోల్చి సిఎం ప్రసంగించడాన్ని తప్పుపట్టారు.

వైసిపి అభ్యర్థులపై 16న స్పష్టత

- ఇడుపులపాయలో ప్రకటించనున్న సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి రోజుకో పేరుతో నెలకొన్న గందరగోళానికి వైసిపి అధిష్టానం తెరదించనుంది. ఇప్పటికే పలుదఫాలుగా అభ్యర్థులను మారుస్తూ వచ్చిన ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 16వ తేది తుది జాబితా ప్రకటించనున్నారు. ఇప్పటివరకు ప్రకటించిన అన్ని జాబితాలను కలిపి మొత్తం 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల అభ్యర్థుల వివరాలను ఇడుపాలపాయ వేదికగా ఆయన వెల్లడించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తుది జాబితా ప్రకటన తరువాత 18వ తేదిన శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురం నియోజకవర్గం నుండి ఆయన ప్రచార పర్వాన్ని ప్రారంభించానున్నారు. . జగన్ ప్రచారం కోసం ప్రత్యేకంగా హెలికాప్టర్‌లను తీసుకున్నారు. ప్రతి రోజు రెండు మూడు ప్రాంతాల్లో బహిరంగ సభలను నిర్వహించేలా ప్రణాళికలను తయారు చేసినట్లు తెలిసింది. మొదటి రోజున శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి మొదలు పెట్టి ఆదే రోజున విజయవాడ వెస్ట్, నెల్లూరు రూరల్‌లో జరిగే బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనేలా కార్యక్రమాలను రూపొందించారు. బహిరంగ సభలతో పాటు కీలకమైన నగరాల్లో రోడ్ షోలలో పాల్గొనేలా పార్టీ వర్గాలు షెడ్యూల్‌ను రూపకల్పన చేస్తున్నారు.

కీలక నియోజకవర్గాలపై ఫోకస్-తాడేపల్లిలో అసంతృప్తవాదులతో చర్చలు

రాష్ట్రంలో తలనొప్పిగా మారిన నియోజకవర్గాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు నగరి, సత్తెనపల్లిలో మళ్లీ వారికే టికెట్ ఇస్తే ఓడించి తీరుతామని ఆయా నియోజకవర్గాల్లోని కీలకనేతలు రోడ్డెక్కిన విషయం తెలిసిందే. నర్సారావుపేట నుండి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి మరో అవకాశం ఇవ్వవద్దని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేశారు. ఆయా నియోజకవర్గాల్లోని అసంతృప్తవాదులను పార్టీ నాయకత్వం సముదాయిస్తోంది. చర్చలు కొలిక్కిరాకపోతే ఆ స్థానాల్లో కూడా అభ్యర్థులను మార్చే అవకాశం వుందని వైసిపి వర్గాలు చెబుతున్నాయి.

వాటర్ సప్లయ్ స్కీమ్ వర్కర్ల బకాయిలు చెల్లించాలి

- ఎపి ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఉమ్మడి అనంతపురం జిల్లాలో వున్న నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ వర్కర్లకు వేతన బకాయిలు, పిఎఫ్ బకాయిలను చెల్లించాలని ఎపి ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జి ఓబులు పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధిశాఖ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ పథకం ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 750 గ్రామాలకు తాగునీరు అందుతోందని తెలిపారు. ఈ స్కీమ్‌లో దాదాపు 600 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి సక్రమంగా వేతనాలు అందించడం లేదని అన్నారు. అలాగే పిఎఫ్, ఇఎస్‌ఐ వంటివి వేతనాల నుంచి కోత పెట్టినా ఖాతాల్లో జమచేయడం లేదని తెలిపారు. వేతనాల చెల్లింపులో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే స్కీమ్ వర్కర్లకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



నెల్లూరులో నిరసన ర్యాలీ చేస్తున్న నాయకులు

బిజెపి పాలనలో లౌకికతత్వానికి విఘాతం

- సిఎఎకు వ్యతిరేకంగా నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పౌరసత్వ సవరణ (సిఎఎ) చట్టం పేరుతో దేశప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్న బిజెపి చర్యలను వ్యతిరేకిస్తూ పలుచోట్ల నిరసన తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ దేశంలోని లౌకిక తత్వానికి, మతసామరస్యానికి విఘాతం కలిగించే విధంగా పాలన సాగిస్తుందని పలువురు విమర్శించారు. నెల్లూరులో ఆత్మకూరు బస్టాండ్ వద్ద వామపక్షాలు, పౌరహక్కుల సంఘం, ప్రజాసంఘాల సభ్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. 2019 డిసెంబర్ 9న పౌరసత్వం సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయన్నారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, సిఎఎ చట్టాల అమలుకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు జరగడంతో చట్టాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేసిందని తెలిపారు. ఎన్నికలు రాబోతున్న తరుణంలో తిరిగి సిఎఎను ముందుకు తీసుకొచ్చిందని విమర్శించారు. దేశంలో నెలకొన్న సమస్యల నుంచి ప్రజల దృష్టి మళించడానికి ఇటువంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రజలందరూ ఆలోచించి రాబోవు ఎన్నికల్లో బిజెపి, ఆ పార్టీకి మద్దతు తెలిపే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కృష్ణా జిల్లా గన్నవరంలో నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ రఘు పాల్గొన్నారు.

సిఎఎను అంగీకరించం: హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను ముస్లిం మైనార్టీల పట్ల వివక్షాపూరితంగా వుందని, ఆ చట్టాన్ని తమ పార్టీ అంగీకరించబోదని వైసిపి ఎమ్మెల్యే ఎమ్‌డి హఫీజ్ ఖాన్ తెలిపారు. కులం, మతం ఆధారంగా కాకుండా భారతీయులందరికీ వివక్షను పాటించకుండా పౌరసత్వం కల్పించేలా సిఎఎలో సవరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎఎ చట్టానికి సంబంధించిన నోటిఫికేషన్‌పై దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు అండగా వున్నారని అన్నారు. కులాలు, మతాల పేరుతో పౌరుల మధ్య వివక్ష చూపటం సరైంది కాదని అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ భద్రత, న్యాయం కల్పించటమే సిఎం జగన్ లక్ష్యమని తెలిపారు. మైనార్టీలకు నష్టం చేకూర్చేలా సిఎఎను తెచ్చిన బిజెపితో టిడిపి కలిసి ఎన్నికల్లో పోటీ చేయడంపై రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎపిపిఎస్‌సిని భ్రష్టు పట్టించిన జగన్

- హైకోర్టు తీర్పు చెంపపెట్టు: టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిపిఎస్‌సిని జగన్ వైసిపిఎస్‌సిగా మార్చేసి పూర్తిగా భ్రష్టు పట్టించారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. 2018 గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలను నిర్ధారించిన హైకోర్టు మెయిన్స్‌ను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది జగన్‌కు చెంపపెట్టు అని అన్నారు. గ్రూప్-1 పేపర్ల మూల్యాంకనం ఇష్టారాజ్యంగా నిర్వహించి నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని విమర్శించారు. ఎటువంటి అర్హతలు లేకున్నా.. వైసిపి నేతలు, జగన్ బంధువులను ఎపిపిఎస్‌సి సభ్యులుగా చేసి మొత్తం పరీక్షల వ్యవస్థను, మూల్యాంకనాన్ని, ఇంటర్వ్యూ పద్ధతుల్ని పాతరేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు ఎపిపిఎస్‌సి, ప్రభుత్వ అసమర్థ పాలనకు అద్దం పడుతోందని టిడిపి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అన్నారు.

ఓటమి భయంతో జగన్ టికెట్ల దుకాణం : అచ్చెన్నాయుడు

రాబోయే ఎన్నికల్లో ఓటమి ఖాయమని జగన్ టికెట్ల దుకాణానికి తెరలేపారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విమర్శించారు. వైసిపి అభ్యర్థుల నుంచి దాదాపు రూ.వెయ్యికోట్లు వసూలు చేశారని ఒక ప్రకటనలో ఆరోపించారు. చిలకలూరిపేట వైసిపి అభ్యర్థిగా మల్లెల రాజేష్ నాయుడును నియమించినందుకు మంత్రి విడదల రజిని, సజ్జల రామకృష్ణారెడ్డి రూ.6.5 కోట్లు తీసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సజ్జలతో పాటు రజినిపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాబూ మోహన్

కె.పాల్‌ను ఎంపిగా గెలిపించండి

- మాజీ మంత్రి, సినీ నటుడు బాబూమోహన్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

రానున్న ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపున విశాఖ ఎంపిగా పోటీ చేస్తున్న పార్టీ అధినేత కె.ఎ.పాల్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని మాజీ మంత్రి, సినీ నటుడు బాబూమోహన్ కోరారు. రైల్వే న్యూ కాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తనకు, పాల్‌కు 35 ఏళ్ల స్నేహ బంధం ఉందని, ఆయన కల్లబొల్లి మాటలు చెప్పకుండా నేరుగా అభివృద్ధి చేసి చూపిస్తారని చెప్పారు. అటువంటి వ్యక్తి పార్లమెంట్‌లో ఉంటే విశాఖ ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కె.ఎ.పాల్ ఎంపిగా గెలిస్తే అప్పులను తీర్చేందుకు కృషి చేస్తారని చెప్పారు. భవిష్యత్తు తరాల వారికి మంచి జరుగుతుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకుండా అవసరమైన నిధులను తానే సమకూరుస్తాని పాల్ చెప్పారని తెలిపారు. కె.ఎ.పాల్ తనను కాకినాడ, గాజువాక నుంచి పోటీ చేయమని చెప్పారని, ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయనని చెప్పినట్లు తెలిపారు. తనకు బిజెపి చేసిన మోసానికి ఆ పార్టీకి రాజీనామా చేశానన్నారు. ఎన్నికల షెడ్యూల్ ఖరారైన తరువాత కె.ఎ.పాల్ తరపున ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు.

జూన్ నెల శ్రీవారి సేవల టికెట్ల కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనానికి జూన్ నెలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టికెట్లు, శ్రీవారి సేవ టికెట్లను టిటిడి విడుదల చేసింది. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల లక్కీడిప్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. మార్చి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారు. జూన్ 19 నుండి 21వ తేదీ వరకు జరగనున్న జ్యేష్టాభిషేకం ఉత్సవంలో సందర్శకులు పాల్గొనేందుకు మార్చి 21న ఉదయం 10 గంటలకు, శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు, దర్శన టికెట్ల అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కోటాను అందుబాటులో ఉంచుతారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతల దర్శనం, గదుల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టకెట్లను, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలలోని గదుల కోటాను విడుదల చేయనున్నారు. 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిలోని శ్రీవారి సేవ కోటాను, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను, పరకామణి సేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 219 | విజయవాడ, గురువారం 14 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 14 March 2024 | Rs

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్‌లో 250 స్టార్టప్‌లు
- 2029కల్లా 50వేల కొత్త ఉద్యోగాల కల్పన
- ఎవిజిసి-ఎక్స్‌ఆర్ విధానాన్ని ఆమోదించిన కేరళ కేబినెట్

7



ఫైనల్‌కు ఢిల్లీ
- గుజరాత్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
- ముగిసిన డబ్ల్యుపిఎల్ లీగ్ మ్యాచ్‌లు

8

'నారీ న్యాయ్' గ్యారెంటీ
మహిళలకు కాంగ్రెస్ ఐదు హామీలు
- ఏడాదికి రూ.లక్ష
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం కోటా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మహిళలకు ఐదు హామీలను ప్రకటించింది. వీటిలో దేశంలోని పేద కుటుంబాల్లోని ప్రతి ఒక్క మహిళకూ ఏటా లక్ష రూపాయల వరకు నగదు బదిలీ, కేంద్రం ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం కోటా వంటివి ఉన్నాయి. "నారీ న్యాయ్" పేరుతో మహిళల కోసం కొత్త అజెండాను ఏర్పాటు చేయబోతున్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఇప్పటికే భాగస్వామ్య న్యాయం, రైతు న్యాయం, యువత న్యాయంపై కాంగ్రెస్ తన హామీలను ప్రకటించిందని ఖర్గే వివరించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీస్సులు కావాలన్నారు. మహారాష్ట్రలోని ధూలేలో జరిగిన 'మహిళా సదస్సు'లో కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ ప్రకటనలు చేశారు.
- "మహాలక్ష్మి" హామీ కింద, ప్రతి పేద కుటుంబం నుంచి ఒక మహిళకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా సంవత్సరానికి రూ. 1 లక్ష రూపాయల సహాయం అందనున్నది.
- "ఆదీ ఆబాదీ పూరా హక్" కింద కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం కొత్త రిక్రూట్‌మెంట్‌లలో మహిళలకు రిజర్వ్ చేయనున్నది.
- "శక్తి కా సమ్మాన్" హామీ కింద ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలవారీ వేతనానికి కేంద్రం ఇచ్చే సహకారం రెట్టింపు అవుతుందని ఖర్గే తెలిపారు.
- "అధికార్ మైత్రి" హామీ కింద, కాంగ్రెస్ ప్రతి పంచాయతీలో "అధికార్ మైత్రి"ని నియమిస్తుంది. ఇది మహిళలకు వారి చట్టపరమైన హక్కుల గురించి అవగాహన కల్పించటానికి, వాటిని అమలు చేయటంలో వారికి సహాయం చేయటానికి పారా లీగల్ కార్యకర్తగా పని చేస్తుంది.
- "సావిత్రి బాయి ఫూలే హాస్టల్స్" హామీ కింద, దేశంలోని వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తుంది. ప్రతి జిల్లాలో కనీసం ఒకటి ఉంటుంది.

2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దు
- మళ్లీ పరీక్ష నిర్వహించాలి
- హైకోర్టు ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-అమరావతి

ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) 2018లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను రద్దు చేస్తూ హైకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. జవాబు పత్రాల మూల్యాంకనం రెండు సార్లు చేయడాన్ని తప్పుపట్టింది. పలుసార్లు మూల్యాంకనం చేయడం చట్ట వ్యతిరేకమని స్పష్టం చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసింది. మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపిక ప్రక్రియ ఆరు వారాల్లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పు వెలువరించారు. మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేశారని, ఒకసారి పేపర్లను దిద్దిన తర్వాత వెలువడిన ఫలితాలను గోప్యంగా ఉంచి రెండోసారి దిద్దిన వాటిలో నచ్చిన వారిని ఎంపిక చేశారంటూ దాఖలైన పిటిషన్లను అనుమతిస్తూ తీర్పు వెలువరించింది.

బాండ్ల దెబ్బకు 'బేర్'
మూడు రోజుల్లో దలాల్ స్ట్రీట్ నుండి 21 లక్షల కోట్లు మాయం
- స్టాక్ మార్కెట్ విలవిల
- ఒక్క రోజులో 14 లక్షల కోట్లు ఆవిరి
- అదాని గ్రూపునకు 1.13 లక్షల కోట్ల నష్టం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. రెండు రోజులుగా కొనసాగుతన్న ఈ పరిణామం బుధవారం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఒకదానితరువాత ఒకటిగా మార్కెట్ సూచీలు పతనం కావడంతో మార్కెట్లో గందరగోళం నెలకొంది. ఉదయం లాభాలతో మొదలైన మార్కెట్లలో 11 గంటల సమయంలో ప్రారంభమైన కుదుపు ట్రేడ్ ముగిసే సమయానికి భారీ పతనంగా నిలిచింది. దీంతో ఒక్క రోజులోనే దాదాపుగా 13లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైంది. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామానికి ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బట్టబయలు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఆదేశాలను అమలు చేయడానికి నిరాకరించిన ఎస్‌బిఐ సుప్రీం మొట్టికాయలతో మంగళవారం సాయంత్రం ఎన్నికల కమిషన్‌కు వివరాలను అందించిన సంగతి తెలిసిందే. దీంతో బుధవారం మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. నిజానికి ఎస్‌బిఐ కోర్టు ధిక్కరణకు పాల్పడిందన్న అభియోగంపై సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించినప్పటినుండి మార్కెట్లో ప్రతికూల కదలికలు ప్రారంభమైనాయి. దీని ప్రభావంతో మొత్తం మీద మూడు రోజుల్లో స్టాక్ మార్కెట్ నుండి 21 లక్షల కోట్లరూపాయలు పైగా మాయం అయినట్లు సమాచారం. ఏయే కార్పొరేట్ కంపెనీలు ఏ ప్రధాన పార్టీకి కొమ్ముకాశాయన్న వివరాలు వెల్లడి అయితే, ఆ సంస్థలపై ప్రజలు నమ్మకం కోల్పోతారన్న ఆందోళనలతో మదుపర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగినట్లు అంచనా వేస్తున్నారు. అయితే, ఇది విస్తృతంగా ప్రచారమైతే పతనాన్ని అడ్డుకోలేమన్న ఆందోళన మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో ఇతర అంశాలను వారు ముందుకు తెస్తున్నారు

అదాని షేర్లను వదిలించుకుంటున్నారు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి, అదాని గ్రూపునకు ఉన్న సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మోడీకి నిధులను సమకూర్చడంలోనూ అదానిది కీలక పాత్రే! అయితే గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారం బట్టబయలైతే భవిష్యత్తులో పరిణామాలు ఎలా ఉంటాయో అన్న ఆందోళన ఇన్వెస్టర్లలో నెలకొంది. దీంతో అదాని షేర్లను వదిలించుకుంటున్నారు. మార్కెట్లో బుధవారం ఒక్కరోజే 13 లక్షల కోట్ల రూపాయలు మాయం కాగా, దానిలో అదాని గ్రూపు ఒక్కటే లక్ష కోట్ల రూపాయలకు పైగా నష్టపోవడం గమనార్హం. అదాని గ్రూపునకు చెందిన వివిధ సంస్థలు నష్టాలబాట పట్టాయి. 15.85 లక్షల కోట్ల అదాని గ్రూపు మార్కెట్టు 14.71 లక్షల కోట్లకు పడిపోయి అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఏకంగా 6.81 శాతం క్షీణించి రూ.2,909.80కి దిగజారింది. గడిచిన ఐదు సెషన్లలో ఈ సూచీ 11.52 శాతం నష్టాన్ని చవి చూసింది. ఈ సంస్థకు బుధవారం ఒక్కరోజే 24,658 కోట్ల రూపాయల నష్టం వచ్చింది. అదాని గ్రీన్ ఎనర్జీ రూ.27,621 కోట్లు (9.07)శాతం, అదాని పవర్ 10,722 కోట్ల రూపాయల మేర (5 శాతం) అదాని పోర్ట్స్ 19,819 కోట్ల రూపాయలు (6.47)శాతం, అదాని టోటల్ గ్యాస్ 9.14 శాతం,చొప్పున పతనమయ్యాయి. అదాని పెట్టుబడులు ఉన్న వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పతనాన్ని చవిచూశాయి. పవర్‌గ్రిడ్ 7.31 శాతం, కోల్ ఇండియా 7.18శాతం, ఎన్‌టిపిసి 6.45శాతం మేర నష్టపోయాయి. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించడానికి వెనుకాడిన ఎస్‌బిఐ కూడా రెండు రోజుల నుండి భారీ నష్టాలను చూస్తోంది. ఎస్‌బిఐ షేర్లు 790

మిగతా 7లో

18 నుంచి ఒంటిపూట బడులు
విద్యాశాఖ ఉత్తర్వులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. ఏప్రిల్ 23వ తేది చివరి పనిదినంగా వెల్లడించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఒంటిపూట బడులను నిర్వహించాల్సిందేనని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని ఇంటికి వెళ్లే సమయంలో అందించాలని పేర్కొన్నారు. తరగతులను చెట్ల కింద, తరగతుల బయట నిర్వహించొద్దని హెచ్చరించారు. ఈ నెల 18వ తేది నుంచి 24వ తేది వరకు పదో తరగతి పరీక్షలు కూడా జరగనున్నాయి. ఈ పరీక్షలు జరిగే పాఠశాలలకు సెలవులుగా ప్రకటించిన ఈ నెల 24, 31 తేదీలతో పాటు ఏప్రిల్ 7,13,14, 21 తేదీల్లో తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.

నోరు మెదపరేం?
సిఎఎపై టిడిపి, జనసేన, వైసిపిలకు వి శ్రీనివాసరావు సూటి ప్రశ్న

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'బిజెపి 2019లో చేసిన సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సిఎఎ)పై దేశమంతా ఆనాడే భగ్గుమంది. కేవలం ముస్లింలే కాకుండా ప్రజానీకంలో అత్యధిక భాగం దాన్ని తిరస్కరించగా మళ్లీ నాలుగేళ్ల తర్వాత 2024 ఎన్నికల ముందు చట్టానికి రూల్స్ ఫ్రేం చేశాం. నోటిఫై చేశామని చెపుతోంది. హిందూ, ముస్లిముల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి ఈ చట్టాన్ని దేశంపై బిజెపి రుద్దుతోంది. తద్వారా ఓట్లు రాల్చుకునే పన్నాగం పన్నింది' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపి ఎందుకు నోరుమెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బి.పద్మ అధ్యక్షతన సిపిఎం విశాఖ జిల్లా విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు (గత ఎన్నికల్లోనే 0.8 శాతం కంటే తక్కువ ఓట్లు వచ్చాయి) తిరస్కరించిన బిజెపితో టిడిపి, జనసేన పొత్తు పెట్టుకుని రాష్ట్రానికి మరింత ద్రోహం చేశాయని, ఆ పార్టీల దిగువ స్థాయి నాయకులు, కార్యకర్తలు బిజెపితో పొత్తుపై కుతకుత లాడిపోతున్నారని తెలిపారు. 'నా మైనారిటీలు, నా ఎస్‌సిలు, నా ఎస్‌టిలు' అంటూ దీర్ఘాలు తీసే ముఖ్యమంత్రి జగన్ సిఎఎపై ఎందుకు నోరు విప్పడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఢిల్లీ పాలకులకు వీరంతా కలసి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు.

చంద్రబాబు మాటలు హాస్యాస్పదం...

బిజెపితో పొత్తు రాష్ట్ర భవిష్యత్తు కోసమంటూ చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని వి.శ్రీనివాసరావు అన్నారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రానికి మోడీ చేసిన మేలేమిటో ఆయన చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెట్టి కేసుల నుంచి బయటపడడానికి బిజెపితో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ను అమ్మకానికి పెట్టిన, రైల్వే జోన్‌కు, పోలవరానికి, విజయనగరం జిల్లాలోని గిరిజన యూనివర్సిటీకి నిధులు ఇవ్వకుండా

మిగతా 7లో

రాజీ పడ్డాం
- మళ్లీ బిజెపి వస్తుందనే పొత్తు
- టిడిపి అధినేత చంద్రబాబు



యువతతో కలిసి 'కలలకు రెక్కలు' పోర్టల్ ఆవిష్కరిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలో బిజెపినే మరలా అధికారంలోకి వస్తుందనే అంచనాతో తాము ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రజాహితం కోసం, ప్రజల కోసం, భవిష్యత్తు తరాల కోసం సీట్ల కేటాయింపులో తాము రాజీపడ్డామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు అనివార్యమని, వైసిపి విముక్త రాష్ట్రం కోసం జనసేన, బిజెపితో కలిశామని అన్నారు. 'కలలకు రెక్కలు' కార్యక్రమం రిజిస్ట్రేషన్ కోసం రూపొందించిన kalalakurekkalu.com వెబ్‌సైట్‌ను బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పారు. ప్రత్యేక హోదా కోసం 2018లో ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చానని అన్నారు. ఇప్పుడు కూడా హోదా కావాలని, విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించొద్దని అడుగుతున్నామని వెల్లడించారు. తాను ఎన్‌డిఎలో కొనసాగి ఉంటే రాష్ట్రం చాలా అభివృద్ధి చెంది ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తన హయాంలో పోలవరం నిర్మాణం 72 శాతం పూర్తయిందన్నారు. విభజన చట్టంలో ఉన్న విద్యాసంస్థలతో పాటు వెనకబడ్డ జిల్లాలకు రూ.350 కోట్లు, రాజధాని నిర్మాణానికి రూ.2,500 కోట్లు సాధించామని అన్నారు. కానీ వైసిపి ప్రభుత్వం ఈ నిధులను కూడా తీసుకురాలేదని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్‌కు ప్రభుత్వం భూములు ఇవ్వలేదని, కేసుల కోసం తిరిగి వాళ్లు లాభపడ్డారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విధ్వంసంతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని చెప్పారు. కేంద్ర సహకారంతోపాటు రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం అవసరమని, లేదంటే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యం కాదని అన్నారు. మంత్రి విడదల రజిని టికెట్ ఇప్పిస్తానని మల్లెల రాజేష్ అనే వ్యక్తి వద్ద రూ.6.5 కోట్లు తీసుకున్నారని, దీనికి సజ్జల రామకృష్ణారెడ్డి బ్రోకరిజం చేశారని విమర్శించారు.

విద్యార్థినుల చదువుకు వడ్డీలేని రుణాలు

ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం, అనుకున్నవి సాకారం చేసేందుకే కలలకు రెక్కలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఇంటర్మీడియట్ తరువాత వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరే విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా బ్యాంకులతో రుణాలు అందిస్తామన్నారు. ఈ రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ఆడపిల్లల చదువు కోసం ఇప్పుడున్న పథకాలు కొనసాగుతాయని వెల్లడించారు.



విశ్వాస పరీక్షలో నెగ్గిన ప్రచండ

ఖాట్మండు : నేపాల్ ప్రధాని ప్రచండ బుధవారం పార్లమెంట్‌లో విశ్వాస పరీక్షలో నెగ్గారు. 275సీట్లు కలిగిన పార్లమెంట్‌లో మూడవ అతిపెద్ద పార్టీగా వున్న నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు సెంటర్)కి చెందిన ప్రచండ విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 157 ఓట్లు రావడంతో ప్రభుత్వం గట్టెక్కింది. నేపాలీ కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకోవడంతో ప్రచండ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్)తో తిరిగి పొత్తు పెట్టుకుని కొత్త కేబినెట్ ఏర్పాటు చేశారు. 2022 డిసెంబరులో ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత ప్రచండ పార్లమెంట్ విశ్వాసాన్ని కోరడం ఇది మూడవసారి. పాలక సంకీర్ణానికి మిత్రపక్షం తోడ్పాటును ఉపసంహరించుకున్న పక్షంలో 30రోజుల్లోగా ప్రధాని సభా విశ్వాసాన్ని కోరాల్సి వుంటుంది.


రాజకీయ నేపథ్యం
న్యాయమూర్తి పదవికి అవరోధం కాదు
సిపిఎం సానుభూతిపరుడు మనోజ్ పులంబి మాధవన్‌పై కేంద్ర అభ్యంతరాన్ని తిరస్కరించిన సుప్రీంకోర్టు కొలీజియం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా సిపిఎం సానుభూతిపరుడి నియామకంపై కేంద్ర ప్రభుత్వ అభ్యంతరాన్ని సుప్రీంకోర్టు కొలీజియం తిరస్కరించింది. న్యాయమూర్తి పదవి ఇవ్వొద్దనడానికి రాజకీయ నేపథ్యం తగిన కారణం కాదని పేర్కొంది. న్యాయవాది మనోజ్ పులంబి మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదించింది. అయితే కొలీజియం ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. "మాధవన్ సిపిఎం సానుభూతిపరుడు. ఆయన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం హయాంలో 2010, 2016-2021లో గవర్నమెంట్ ప్లీడర్‌గా కూడా పని చేశారు" అని కారణంతో ఆయన అభ్యర్థిత్వాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు కొలీజియం "మాధవన్ సిపిఎం సానుభూతిపరుడిగా పరిగణిస్తారనే వాదన చాలా అస్పష్టంగా ఉంటుంది. ఆయనకు రాజకీయ నేపథ్యం ఉందనే వాస్తవం అన్ని సందర్భాల్లోనూ తగిన కారణం కాకపోవచ్చు" అని కేంద్రం సూచనను తిరస్కరిస్తూ కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. వాస్తవానికి, మాధవన్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేయడం వల్ల ఆయన వివిధ న్యాయ శాఖలలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉన్న కేసులను వాదించడంతో తగినంత అనుభవం సంపాదించి ఉంటాడని కొలీజియం తీర్మానం నొక్కి చెప్పింది. "ఉదాహరణకు ఇటీవలి కాలంలో ఒక న్యాయవాది హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అయితే ఆమె ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ముందు ఆమె ఒక రాజకీయ పార్టీకి ఆఫీస్ బేరర్‌గా ఉన్నారు" అని తీర్మానంలో పేర్కొంది.

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఎల్ విక్టోరియా గౌరీ నియామకాన్ని ప్రస్తావిస్తూ కొలీజియం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ గౌరీ మద్రాసు హైకోర్టుకు న్యాయమూర్తిగా కావడానికి ముందు న్యాయవాదిగా ఉన్నప్పుడు బిజెపిలో ఉన్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తులుగా మాధవన్‌తోపాటు ఆరుగురు న్యాయవాదుల పేర్లను ఈ నెల 12న కొలీజియం సిఫార్సు చేసింది. మాధవన్ షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆయన 35 తీర్పులను నివేదించారు. అయితే, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఆయన నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేసింది.



తొలి ఎఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'డెవిన్'

లోపలి పేజీలో..

రూ.238 కోట్లతో కంపా పనులు
- అటవీకరణ, అగ్ని ప్రమాదాల నివారణ
- వన్యప్రాణి సంరక్షణలపైనా శ్రద్ధ

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం
- ఎలక్టోరల్ బాండ్ల వివరాలు గడువులోగా వెల్లడిస్తాం
- మీడియాతో ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్



మీడియాతో మాట్లాడుతున్న భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను నిర్దిష్ట గడువులోగా వెల్లడిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ తెలిపారు. బుధవారం జమ్ముకాశ్మీర్‌ను సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌బిఐ నుంచి బాండ్ల వివరాలు అందిన విషయాన్ని ధ్రువీకరించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తామన్నారు. జమ్మూ కాశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లు ఈ ప్రజాస్వామ్య పండగలో తప్పక పాల్గొనాలని సిఇసి రాజీవ్ కుమార్ కోరారు. తప్పుడు వార్తలపై ఎప్పటికప్పుడు స్పందించేందుకు గాను ప్రతి జిల్లాలో ఒక సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభ్యర్థులందరికీ సరైన భద్రత సమకూర్చడంతోపాటు కేంద్ర బలగాలను దించుతామన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆన్‌లైన్ నగదు బదిలీపైనా పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. 'మార్చి 12 నాటికి ఎస్‌బిఐ ఎలక్టోరల్ బాండ్ల డేటా అందించాల్సి ఉంది. అది మాకు చేరింది. ప్రజలకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. కమిషన్ అనేది పారదర్శకతకు ఎప్పుడూ అనుకూలమే. గడువులోగా దాన్ని బహిర్గతం చేస్తాం' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు.

హింసకు తావు లేకుండా..రీపోల్ అవసరమే రాకుండా..!
- సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఇవే ప్రధానం: ముఖేష్ కుమార్ మీనా

5

సంపాదకీయం

ఆందోళనకరమే!


ద్రవ్యోల్బణం దారికి వచ్చినట్లు కేంద్ర గణాంకాల శాఖ ఎన్నికల వేళ విడుదల చేసిన తాజా నివేదిక పైపై మెరుగులకే పరిమితమైంది. కొద్దిరోజుల క్రితం వృద్ధి లెక్కలకు రెక్కలు తొడిగి విమర్శల పాలైన కేంద్ర ప్రభుత్వం మళ్లీ అదే తరహా విన్యాసానికి పాల్పడిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విమర్శలు ఎలా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలనే పరిగణలోకి తీసుకున్నా భవిష్యత్తు ఆందోళనకరంగానే ఉంటుందన్న అభిప్రాయం నిపుణుల్లో వ్యక్తమవుతోంది. తాజా నివేదిక ప్రకారం ప్రధాన ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.3 శాతానికి తగ్గింది. విభాగాల వారీగా చూస్తే వినియోగదారుల ధరల సూచీ రిటైల్ ద్రవ్యోల్బణం 5.09 శాతం వద్ద స్థిరంగా ఉన్నట్లు గణాంకాల శాఖ ప్రకటించింది. జనవరిలో రిటైల్ సూచీ 5.10 శాతంగా ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఇది 6.44 శాతంగా ఉందని, అక్కడి నుండి దిగిరావడంతో పాటు, ఆరు నెలల పాటు గరిష్ట కట్టడి స్థాయి యైన 6 శాతం కన్నా దిగువగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రజల వాస్తవ ఆదాయాలు పెద్దగా పెరగకపోవడం, నిరుద్యోగం పెరగడం, విద్య-వైద్యం వంటి రంగాల్లో ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే స్థాయిలో ఉన్నప్పటికీ రానున్న నాలుగైదు నెలల కాలంలో ధరలు మూడు నుండి నాలుగు శాతం పెరిగే అవకాశం ఉందంటూ వస్తున్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అత్యంత కీలకమైన ఆహార పదార్థాల ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైన విషయం తాజా గణాంకాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజల మీద నేరుగా ప్రభావం చూపే ఈ అంశాన్ని చూసీ చూడనట్లు మోడీ సర్కారు వ్యవహరిస్తోంది. ప్రభుత్వానికి వంత పాడే మీడియాది కూడా ఇదే వైఖరి. జనవరిలో 8.3 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 8.66 శాతానికి పెరిగింది. 2023లో సగటున 5.95 శాతంగానే ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం నమోదు కావడం గమనార్హం. ప్రజలు తమ కష్టార్జితమంతా ఆహార పదార్థాల మీదనే ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఏటికేడాదికి పెరుగుతున్నా పాలకులకు ఏ మాత్రం పట్టకపోవడం బాధాకరం! దేశవ్యాప్తంగా ధాన్యాలు, మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తుల ధరలు పెరిగాయి. జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో వంటనూనెలు, కూరగాయలు వంటి ధరల్లో కొంత తగ్గుదల కనిపించిందని గణాంకాలు పేర్కొన్నాయి. అయితే, తిండిగింజల ధరలు ఏటికేడాదికి పెరుగుతూనే ఉండటం సామాన్యులతో పాటు మధ్య తరగతికి శరాఘాతంగా మారుతోంది. దీనిని సరిదిద్ది ధరలకు కళ్లెం వేయవలసిన కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 5 కిలోల బియ్యం ఇచ్చి, ఇతర ఆహార పదార్థాలకు కోత పెట్టడం దుర్మార్గం. ఈ పరిస్థితే దేశంలో అన్నార్తుల సంఖ్యను ఏటికేడాదికి పెంచుతోంది. ప్రపంచ ఆహార నివేదిక చెబుతున్నది ఇదే! దేశ వ్యాప్తంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళల్లో రక్తహీనత పెరగడానికి, శిశువులు పోషకాహార లేమితో బాధపడటానికి ఈ పరిస్థితే కారణం. క్షేత్రస్థాయిలో అడుగడుగునా కనిపించే ఈ వాస్తవ దుస్థితిని మార్చకుండా, కాగితాలపై గణాంకాలను ఎంత గొప్పగా తీర్చిదిద్దినా ఫలితం శూన్యం.

పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఆర్భాటంగా చెప్పుకుంటున్న మన రాష్ట్రంలో రిటైల్ ద్రవ్యోల్బణం జాతీయ సగటుకన్నా అధికంగా నమోదైనట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. అస్సాం, గుజరాత్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిషా, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి! ధరలను అదుపు చేయడంలో విఫలం కావడంతో ఎప్పటికప్పుడు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్న మొత్తం ఏ మూలకూ రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం బియ్యంతో సరిపెట్టకుండా కేరళలో మాదిరి ఇతర నిత్యావసర వస్తువులను కూడా రేషన్ షాపుల ద్వారా అందించాలి. దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన అభివృద్ధి వస్తుంది. చిత్తశుద్ధితో అమలు చేసే ఆ తరహా కార్యక్రమాలే ప్రజలకు ఊరటనిస్తాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో అధిక ద్రవ్యోల్బణం నమోదు కావడం ఉపాధి హామీ చట్టం అమలుకు ఉన్న ప్రాధాన్యతను తెలియచేస్తోంది. ఈ చట్టాన్ని నీరుగార్చడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించాలి. మరిన్ని ఎక్కువ పని దినాలను, ఎక్కువ కూలీని సాధించాలి. ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. ఆ దిశగా చర్యలు చేపట్టేలా ప్రజల నుండి ఒత్తిడి పెరగాలి.

మహనీయుల మాట


నేడు కారల్ మార్క్స్ వర్ధంతి



విప్లవ పథంలో పయనించే వీరయోధులు, ప్రతి పరాజయం నుంచీ కొత్త శక్తిని కూడగట్టుకుంటారు. చరిత్ర ప్రవాహంలో ఎంతగా ఈదులాడితే, మనోధైర్యం అంతగా పెరుగుతుంది.

జననం : 5.5.1818
మరణం : 14.3.1883

బిజెపి పొత్తు ప్రమాదకరం



ఏ పార్టీతో బిజెపి స్నేహం చేసినా అది కేవలం ఎన్నికలు, అధికారం కోసం మాత్రమే కాదు, దాని దీర్ఘకాలిక లక్ష్యం సాధించుకోవడానికే నన్నది జగమెరిగిన సత్యం. తనతో స్నేహం చేసిన పార్టీలను మింగివేయడం దాని సంస్కృతి. తనతో కలిసి పనిచేసిన శివసేన (బిజెపి కంటే కరుడు కట్టిన హిందూ పార్టీగా ఒకనాడు గుర్తింపు వున్న పార్టీ), అనేక సంవత్సరాలు బీహార్ రాజకీయాలను శాసించిన నితీష్ కుమార్ పార్టీ, తమిళనాడులో అన్నాడిఎంకె...ఇలా ఒకటేమిటి అనేక పార్టీల పరిస్థితి ఏ స్థాయికి చేరిందో, బిజెపి పట్ల ఊగిసలాడిన బిఆర్ఎస్ తెలంగాణలో ఎలా గిలగిల కొట్టుకుంటోందో చూస్తున్నాము. ఇన్ని అనుభవాలు కళ్ళ ముందు వున్నా బిజెపితో స్నేహానికే తెలుగుదేశం పార్టీ సిద్ధపడడం స్వయంకృతాపరాధం, ఆత్మహత్యా సదృశ్యం. బిజెపితో టిడిపి, జనసేన స్నేహం కేవలం ఆ పార్టీలకే కాదు. ఆంధ్ర ప్రజల భవిష్యత్తుకు ప్రమాదకరం.

విశ్లేషణ



వి. రాంభూపాల్

రాష్ట్రానికి వినాశకరమైన ఎన్నికల పొత్తు పొడిచింది. తెలిసి తెలిసి తెలుగుదేశం, జనసేన పార్టీలు బిజెపి కొరివిని నెత్తిమీద పెట్టుకున్నాయి. తాత్కాలిక వెచ్చదనం కోసం ధృతరాష్ట్ర కౌగిలిలోకి చేరాయి. బిజెపితో పొత్తు కోసం తెలుగుదేశం వెంపర్లాడిన తీరు, ఒక్క శాతం ఓట్లు లేని పార్టీతో నలభై శాతానికి పైగా ఓట్ల బలం వున్న పార్టీ నేత ప్రాధేయపడుతూ, ఢిల్లీలో పడిగాపులు కాయడం చూస్తుంటే 'అన్న' గారి ఆత్మే కాదు, ఆంధ్రుల అంతరాత్మ తీవ్ర ఆవేదనకు గురవుతున్నది. రాజకీయాల్లో ఎత్తులు, పొత్తులు కొత్త కాదు. కానీ పొత్తులకు ఒక విధానం, లక్ష్యం వుండాలి కదా! టిడిపి, జనసేన ఏ విధానం, ఏ లక్ష్యం కోసం బిజెపితో పొత్తుకు సిద్ధమయ్యాయి? ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికా? విభజన చట్టం హామీల సాధనకా? లేదు దేశాభివృద్ధికా? ఢిల్లీ ప్రభువుల ముందు టిడిపి, జనసేన ఎందుకు మోకరిల్లుతున్నాయి? సయోధ్య కోసం వచ్చిన వారిపట్ల ఢిల్లీ బిజెపి నేతల ఆ చులకన భావమేమిటీ? రెండు పార్టీల నేతలను మూడు రోజులు పడిగాపులు కాసేటట్లు చేయడమేమిటీ? పొత్తులపై బిజెపి ఏకపక్షంగా ప్రకటన చేయడమేమిటీ? తెలుగుదేశానికి ఈ పరిణామం అనివార్యమా, అవకాశవాద ఫలితమా? సింహం సింగిల్‌గా వస్తుందని సినిమా డైలాగులు చెబుతున్న వైసిపి కూడా కేంద్రంతో లోపాయికారి పొత్తులోనే ఈ ఐదు సంవత్సరాలు తరించిందనే విషయం జగమెరిగిన సత్యం కదా!

బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు 2014లో కూడా కలిశాయి కదా. అప్పుడులేని ప్రమాదం ఇప్పుడు ఎందుకు వుంటుందని అమాయకంగా కొందరు అడుగుతున్నారు. చంద్రబాబు మరొక అడుగు ముందుకు వేసి తాను బిజెపికి మద్దతు ఇచ్చిన కాలంలో మత ఘర్షణలే జరగలేదని, ముస్లింల హక్కులను అప్పుడు తాను కాపాడానని ఆత్మవంచన చేసుకుంటున్నారు. 2014కు ముందు బిజెపి కేంద్రంలో అధికారంలో లేదు. రాష్ట్రాన్ని ముక్కలు చేసింది కాంగ్రెసు అనే కోపం ఆనాడు ఆంధ్ర ప్రజల్లో ఉంది. బిజెపి అధికారంలోకి వస్తే విభజిత ఆంధ్ర అభివృద్ధికి మేలు జరుగుతుందని ప్రజలను నమ్మించగలిగారు. కాని గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిన తర్వాత, ఈ పది సంవత్సరాల్లో దేశంలో జరుగుతున్న మత కలహాలు, రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదాలు చూసిన తర్వాత విజ్ఞత కలిగిన వారు ఈ పొత్తును ఎలా బలపరుస్తారు? కేంద్రం బిజెపి పాలనలో టిడిపి భాగస్వామిగా వున్న కాలంలో 5,417 మత ఘర్షణల కేసులు నమోదయినట్లు కేంద్ర హోంశాఖ 2020లో పార్లమెంట్‌కు తెలిపిన విషయం చంద్రబాబు మరచిపోయినా మత సామరస్యాన్ని కోరుకునే వారు మరవలేరు కదా!

'నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసింది. ఆంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బ తీయవద్దు. మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వారికి ఎలా గుణపాఠం చెప్పాలో మాకు బాగా తెలుసు, మీరు మీ మార్గాన్ని సరిదిద్దుకోకపోతే ఆంధ్రప్రదేశ్ నుండి మీ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది' అని 2019 ఫిబ్రవరి 10న ఢిల్లీలో చంద్రబాబు మోడీని హెచ్చరించారు. నల్ల చొక్కా వేసుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఢిల్లీలో ధర్మ పోరాట దీక్ష చేశారు. బిజెపి యేతర 25 పార్టీల సంఘీభావాన్ని కోరారు. ఇందుకు ఒకరోజు ముందు గుంటూరు జిల్లాలో జరిగిన బహిరంగసభలో 'కేంద్రం ఇస్తున్న నిధులను బాబు, లోకేష్ కాజేస్తున్నారని, పోలవరం ప్రాజెక్టును ఎటిఎం లాగా వాడేస్తున్నారని' మోడీ విమర్శించారు. పాచిపోయిన లడ్డూలు ఇచ్చారని మోడీని పవన్‌కళ్యాణ్ పదేపదే విమర్శించారు. నాటి మాటలకు, నేటి పొత్తులకు విశ్వసనీయత వుండాలంటే గడిచిన ఈ ఐదేళ్ళలో మన రాష్ట్రానికి బిజెపి ఏమి మేలు చేసి...తాను చేసిన తప్పులను సరిదిద్దుకుందో చంద్రబాబు, పాచిన లడ్డూలు మంచి లడ్డూలు ఎలా అయ్యాయో పవన్ కళ్యాణ్, అవినీతి నుండి బాబు, లోకేష్‌లు ఎలా పునీతులయ్యారో మోడీ ప్రజలకు చెప్పాలి. బిజెపి మతోన్మాద పార్టీ అని, దాని కూటమిలో వుండడం దేశానికి ప్రమాదకరమని 2018లో ఎన్‌డిఎ కూటమి నుండి తెలుగుదేశం పార్టీ బయటకు వచ్చింది. ఈ ఐదు సంవత్సరాల్లో బిజెపి మత సామరస్య పార్టీగా, ఎన్‌డిఎ దేశ సంక్షేమ కూటమిగా మారిందని పొత్తుకు సిద్ధమై ఎన్‌డిఎ కూటమిలో చేరుతుందా? ఇరుపక్షాలు జవాబు చెప్పుకోవలసిన ప్రశ్నలు ఇవేకదా!

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందే కేంద్ర పెత్తనానికి వ్యతిరేకంగా. అప్రజాస్వామికంగా ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని నాడు కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వం కూల్చివేస్తే దేశవ్యాప్తంగా పోరాడింది కమ్యూనిస్టులు, ప్రజాస్వామికవాదులు. నాటి నుండి సుమారు 25 సంవత్సరాలు తెలుగుదేశం, కమ్యూనిస్టులు ఎన్నికల్లో కలిసి పనిచేశారు. విధానపరమైన అనేక మౌలిక అంశాల మీద టిడిపి, కమ్యూనిస్టు పార్టీల వైఖరులు వేరైనా, రాజ్యాంగంలోని కీలకమైన సమాఖ్య స్ఫూర్తి, లౌకికవాదం, సామాజిక తరగతుల సంక్షేమం అనే లక్ష్యాలు కమ్యూనిస్టులను, టిడిపిని సుదీర్ఘ కాలం కలిపి వుంచాయి. 1991 తర్వాత వచ్చిన ప్రపంచీకరణ విధానాలు ప్రాంతీయ పార్టీల వైఖరులను మార్చివేశాయి. విధానాల స్థానంలో అవకాశవాదానిది పై చెయ్యి అయ్యింది. దీనికి తోడు తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో వచ్చిన మార్పులు మరింతగా మార్చివేశాయి. పార్టీల మధ్య పొత్తులు పెట్టుకోవడానికి, విడిపోవడానికి విధానాలను గాలికి వదిలేసిన పాలక పార్టీలు, అందుకు విరుద్ధంగా సిద్ధాంత ప్రాతిపదికన పనిచేసే కమ్యూనిస్టు పార్టీలను, ఆ నేతలను నిందించడం, విమర్శించడం ఫ్యాషన్‌గా మారింది. పాలక పార్టీల అనుకూల మీడియా సంస్థలు ఇందుకు అనుగుణంగా వంత పాడి రాజకీయాలను మరింతగా భ్రష్టుపట్టించాయి. తాము అనుసరించిన అవకాశవాద విధానాలే నేడు ప్రాంతీయ పార్టీల ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. కేంద్ర బిజెపి కనుసన్నల్లో వుంటేనే తమకు భవిష్యత్ అనే దీనావస్థకు దిగజార్చాయి. బిజెపి కేవలం రాజకీయ అధికారాన్ని మాత్రమే కోరుకోవడంలేదు. రాజ్యాంగాన్ని, దాని మూల స్థంభాలను ధ్వంసం చేసి మత రాజ్యాన్ని నిర్మించాలనే ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలకు లోబడి పనిచేస్తున్నది. అందుకే అది రాజకీయాలు మాత్రమే చేయడంలేదు. ప్రాంతీయ పార్టీలను మింగివేసి ఏక పార్టీ వ్యవస్థను నిర్మించాలనే వినాశకరమైన లక్ష్యంతో పని చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత జరిగిన ఈ పది సంవత్సరాలు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి, వైసిపి చెరో ఐదు సంవత్సరాలు పాలించాయి. ఈ రెండు పార్టీలు కేంద్ర బిజెపి ప్రభుత్వంతో విడదీయరాని స్నేహంగానే వున్నాయి. పార్లమెంట్‌లో బిజెపి పెట్టిన ప్రతి బిల్లును, ప్రతి నిర్ణయాన్ని ఏ చర్చ లేకుండా బలపరుస్తూ వచ్చాయి. ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు ఇస్తామని, రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, కేంద్రసంస్థల ఏర్పాటు జరిగి తీరుతాయని నాడు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లతో కలిసి మోడీ చెప్పారు. మన సంఖ్యా బలంతో అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి వచ్చిందనే సాకుతో వైసిపి ఈ ఐదు సంవత్సరాలు నిస్సిగ్గుగా బిజెపిని అన్ని విషయాల్లో సమర్థించింది. అయినా గత ఐదు, ప్రస్తుత ఐదు సంవత్సరాలు రాష్ట్రాభివృద్ధికి నిధులు ఎందుకు రాలేదు? విభజన చట్టంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు పూర్తిగా ఎందుకు నోచుకోలేదు? రాష్ట్రాల హక్కులను కాలరాసే కేంద్ర నిరంకుశ చర్యలను, మత సామరస్యాన్ని దెబ్బ తీసే మతోన్మాద దుర్మార్గాలను, జాతి సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పగించే వినాశకర విధానాలను పార్లమెంట్‌లో ఎన్‌డిఎ పార్టీల కంటే ఎక్కువగానే వైసిపి, టిడిపి బలపరిచి తమ ప్రభు భక్తిని అనునిత్యం చాటుకున్న బిజెపి ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు ద్రోహం చేస్తూనే వచ్చింది?

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్ని విధాలా అన్యాయం చేసినా కేంద్ర బిజెపి ప్రభుత్వ దుర్మార్గాన్ని ప్రజలు ఆలోచించకుండా, ప్రశ్నించకుండా వుండేందుకు టిడిపి, వైసిపి పోటీలు పడి కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. యుద్ధం, సిద్ధం అంటూ ఒకదానిపై ఒకటి రంకెలు వేసుకుంటున్నాయి. దశాబ్దం తర్వాత కూడా రాజధాని లేక, పోలవరం పూర్తికాక, కేంద్ర సంస్థలు ఏ ఒక్కటి నిర్మాణం జరగకపోయినా బిజెపిని ఎందుకు బలపరుస్తున్నాయి? కేవలం అధికార కాంక్ష, వ్యక్తిగత కేసుల భయం. గత ఎన్నికల ముందు ఏ కారణాలు చెప్పి ఎన్‌డిఎ నుండి బయటకు వచ్చారో అదే కారణాలపై టిడిపి ఈ కాలంలో పోరాడి వుంటే రాష్ట్ర పరిస్థితి, టిడిపి పరిస్థితి ఇంత ఘోరంగా వుండేది కాదు. పోలవరం, రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వకపోయినా, కేంద్రం అండతో మూడు రాజధానుల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి కొత్త నాటకాన్ని ఐదు సంవత్సరాలు కొనసాగించినా, రాజధాని నిర్మాణం చేపట్టకపోయినా, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తున్నా, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా, చివరకు తనను జైలులో పెట్టడానికి పరోక్షంగా కారణమైనా బిజెపిని ఒక్క మాట కూడా మాట్లాడలేని పరిస్థితిని చంద్రబాబు కొని తెచ్చుకున్నారు. తనను జైల్లో పెట్టడంలో కేంద్ర బిజెపి పాత్ర లేదని ఢిల్లీలో చంద్రబాబు ప్రకటించుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చిందో తెలుగుదేశం శ్రేణులు ఆలోచించుకోవాలి. డీజల్, పెట్రోల్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా, మణిపూర్‌లో ఘోర నరమేధం జరిగినా, బిల్కిస్‌బానో కుటుంబంపై హత్యాచారాలకు పాల్పడిన వారిని స్వేచ్ఛగా వదిలేసినా, అనేక రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేస్తున్నా చంద్రబాబు, టిడిపి కనీసం స్పందించలేని రాజకీయ అనిశ్చితిలోకి చేరుకున్నాయి. దీనికితోడు తనకున్న కొద్దిపాటి ఎంపీల ద్వారా, తన అనుచరులను బిజెపిలో చేర్చడం ద్వారా బిజెపికి దగ్గరకు కావడానికే ఈ కాలమంతా ప్రయత్నించారు. ఒకనాడు ఢిల్లీలో చక్రం తిప్పారనే వ్యక్తి నేడు బిజెపి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేసే స్థాయికి చేరుకున్నారు! బిజెపితో పొత్తు కుదుర్చుకుంటున్న టిడిపి, జనసేనలను విమర్శిస్తున్న వైసిపి...రాష్ట్ర అభివృద్ధికి ఆటంకమైన బిజెపిని మాత్రం ఏమీ మాట్లాడలేదు.


ఏ పార్టీతో బిజెపి స్నేహం చేసినా అది కేవలం ఎన్నికలు, అధికారం కోసం మాత్రమే కాదు, దాని దీర్ఘకాలిక లక్ష్యం సాధించుకోవడానికే నన్నది జగమెరిగిన సత్యం. తనతో స్నేహం చేసిన పార్టీలను మింగివేయడం దాని సంస్కృతి. తనతో కలిసి పనిచేసిన శివసేన (బిజెపి కంటే కరుడు కట్టిన హిందూ పార్టీగా ఒకనాడు గుర్తింపు వున్న పార్టీ), అనేక సంవత్సరాలు బీహార్ రాజకీయాలను శాసించిన నితీష్ కుమార్ పార్టీ, తమిళనాడులో అన్నాడిఎంకె...ఇలా ఒకటేమిటి అనేక పార్టీల పరిస్థితి ఏ స్థాయికి చేరిందో, బిజెపి పట్ల ఊగిసలాడిన బిఆర్ఎస్ తెలంగాణలో ఎలా గిలగిల కొట్టుకుంటోందో చూస్తున్నాము. ఇన్ని అనుభవాలు కళ్ళ ముందు వున్నా బిజెపితో స్నేహానికే తెలుగుదేశం పార్టీ సిద్ధపడడం స్వయంకృతాపరాధం, ఆత్మహత్యా సదృశ్యం. బిజెపితో టిడిపి, జనసేన స్నేహం కేవలం ఆ పార్టీలకే కాదు. ఆంధ్ర ప్రజల భవిష్యత్తుకు ప్రమాదకరం. టిడిపి, జనసేనలతో ప్రత్యక్షంగా, వైసిపితో పరోక్షంగా రాష్ట్ర రాజకీయాల్లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి ప్రమాదాన్ని చైతన్యవంతమైన రాష్ట్ర ప్రజలు రాజకీయ విజ్ఞతతో తిప్పికొట్టడం రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

పదేళ్ల మోడీ పాలన

మహిళలకు ఉపాధి, శాంతిభద్రతలు కరువే !

వ్యాఖ్య



ఎం. కోటేశ్వరరావు

పదేళ్ల పాలన గురించి ప్రసార మాధ్యమాల్లో మోడీ గ్యారంటీల గురించి ఎంత ఊదరగొట్టినా పరిస్థితుల్లో పెద్ద మార్పు లేదు, దిగజారుడే కనిపిస్తోంది. మహిళల శాంతిభద్రతల గురించి, తాజా సూచికల గురించి అంతర్జాతీయ మీడియాలో పేర్కొన్న అంశాలు నరేంద్ర మోడీ పరువును మరింత పోగొట్టేవిగా ఉన్నాయి తప్ప మరొకటి కాదు. 'స్టాటిస్టా' అనే సంస్థ సమీక్ష జార్ఖండ్‌లో స్పానిష్-బ్రెజిలియన్ పర్యాటకురాలి మీద...ఆమె భర్త ముందే ఎనిమిది మంది చేసిన అత్యాచార ఉదంతంతో ప్రారంభమైంది. ఇది అంతర్జాతీయంగా సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. ప్రపంచంలో మహిళలకు రక్షణ లేని దేశాల సరసన చేర్చి మన గురించి చర్చించుకుంటున్నారు. దేశంలో రోజుకు 86 అత్యాచారాలు జరుగుతున్నట్లు 2022లో నమోదైంది.



పదేళ్ల నరేంద్ర మోడీ పాలనను వెనక్కు తిరిగి చూసుకుంటే జనాభాలో సగ భాగమైన మహిళల స్థితి ఏమిటి? మహిళలకు శాంతిభద్రతలు, రక్షణ సూచికలో మనమెక్కడున్నామో తెలుసా? మన మిత్ర దేశంగా మోడీ అండ్ కో చెప్పుకుంటున్న అమెరికా లోని జార్జి టౌన్ సంస్థ రూపొందించిన 2023 విశ్లేషణ ప్రకారం 177 దేశాలలో 128వ స్థానంలో ఉన్నాం. మోడీ గొప్పదనం గురించి చెప్పుకొనేందుకు ఆయన భక్తులు నిత్యం వల్లించే పాకిస్తాన్ 158 స్థానంలో ఉండటం ఎంతో 'ఊరట' కలిగిస్తుందని వేరే చెప్పనవసరం లేదు. బేటీ పఢావో, బేటీ బచావో నినాదంతో పాటు అచ్చే దిన్ వాగ్దానం చేసిన మోడీ ఏలుబడిలో తొమ్మిది సంవత్సరాల తరువాత పరిస్థితి ఇది. పోనీ మెరుగుపడే ఆశ ఉందా? 2017 నివేదిక ప్రకారం మన దేశం 131వ స్థానంలో ఉన్నది కాస్తా 128కి ఎగబాకింది. ఇదేమీ పెద్ద మెరుగుదలా, పెరుగుదలా కాదు. పాయింట్ల పరంగా చూస్తే 0.580 నుంచి 0.595కు (15) చేరినప్పటికీ ర్యాంకులో పెద్దగా మెరుగుదల లేదంటే దాని అర్థం మిగతా దేశాల్లో పరిస్థితి బాగా మెరుగుపడినట్లు. ఉదాహరణకు పాకిస్తాన్‌నే తీసుకుందాం. ఇదే కాలంలో దాని పాయింట్లు 0.441 నుంచి 481కి (40) పెరిగినప్పటికీ రాంకు 150 నుంచి 158కి దిగజారింది. పాయింట్ల వారీ చూస్తే మన కంటే పాకిస్తాన్‌లో మెరుగుదల చాలా ఎక్కువగా ఉంది. మరో పొరుగు దేశమైన చైనా ర్యాంకు ఈ కాలంలో 87 నుంచి 82కు పెరిగింది. పాయింట్ల వారీ చూస్తే 0.671 నుంచి 0.7కు (29) చేరింది. ఇరుగు దేశమైన బంగ్లాదేశ్ 127 నుంచి 131కు దిగజారింది, అయినా అక్కడ పాయింట్ల వారీ చూస్తే 0.585 నుంచి 0.593కు పెరిగింది. స్త్రీ-పురుష తేడా 2023 సూచికలో మన దేశం ప్రపంచ ఆర్థిక వేదిక నివేదిక ప్రకారం 146 దేశాల్లో 127వదిగా ఉంది. మోడీ అధికారానికి వచ్చిన 2014లో అది 142 దేశాల్లో 114వ స్థానంలో ఉంది. ఈ సంస్థ వెల్లడించిన సమాచారం ప్రకారం 2022లో 135వదిగా ఉంది. ఒక్క ఏడాదిలో ఎనిమిది స్థానాలు ఎలా పెరిగిందన్నది ఆలోచించాల్సిన అంశం. ఒకవేళ దాన్నే ప్రామాణికంగా తీసుకుంటే 114 నుంచి 135కు ఎందుకు దిగజారినట్లు? ఏ రీత్యా చూసినా గడచిన పదేళ్లలో మొత్తం మీద ఈ అంతరం తగ్గకపోగా పెరిగిందని స్పష్టంగా కనిపిస్తోంది. లింగ అసమానతలో 2021 సూచిక ప్రకారం చైనా 48, శ్రీలంక 92, నేపాల్ 113, మనదేశం 122, బంగ్లాదేశ్ 131, పాకిస్తాన్ 149 స్థానాల్లో ఉన్నాయి. మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశాల సూచికలో ఆఫ్ఘనిస్తాన్ 1, పాకిస్తాన్ 4, భారత్ 9, బంగ్లాదేశ్ 17, చైనా 23, శ్రీలంక 65 స్థానాలలో ఉన్నాయి. మన దేశం గురించి ఇలాంటి సూచికలన్నీ ప్రపంచ మంతటా అందరికీ తెలిసినప్పటికీ నరేంద్ర మోడీని ప్రపంచ నేతగా గుర్తించిందని బిజెపి నేతలు ప్రచారం చేయటం విడ్డూరం కాదా! పదేళ్ల పాలన గురించి ప్రసార మాధ్యమాల్లో మోడీ గ్యారంటీల గురించి ఎంత ఊదరగొట్టినా పరిస్థితుల్లో పెద్ద మార్పు లేదు, దిగజారుడే కనిపిస్తోంది. మహిళల శాంతిభద్రతల గురించి, తాజా సూచికల గురించి అంతర్జాతీయ మీడియాలో పేర్కొన్న అంశాలు నరేంద్ర మోడీ పరువును మరింత పోగొట్టేవిగా ఉన్నాయి తప్ప మరొకటి కాదు. 'స్టాటిస్టా' అనే సంస్థ సమీక్ష జార్ఖండ్‌లో స్పానిష్-బ్రెజిలియన్ పర్యాటకురాలి మీద...ఆమె భర్త ముందే ఎనిమిది మంది చేసిన అత్యాచార ఉదంతంతో ప్రారంభమైంది. ఇది అంతర్జాతీయంగా సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. ప్రపంచంలో మహిళలకు రక్షణ లేని దేశాల సరసన చేర్చి మన గురించి చర్చించుకుంటున్నారు. దేశంలో రోజుకు 86 అత్యాచారాలు జరుగుతున్నట్లు 2022లో నమోదైంది. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు పెరుగుతున్నట్లు నమోదైన నివేదికలు వెల్లడిస్తున్నాయి. అసలు పోలీసుల వరకు రాని కేసులు ఎన్నో. ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న, ఒక యోగి పాలనలో వున్న ఉత్తరప్రదేశ్ 2022లో ప్రథమ స్థానంలో ఉంది.

ప్రపంచం మొత్తం మీద చూసినపుడు స్త్రీల కంటే పురుషుల సంఖ్య ఎక్కువ. అయితే ఇదే స్థితి అన్ని చోట్లా లేదు. కొన్ని దేశాల్లో పురుషులు, కొన్ని చోట్ల మహిళలు ఎక్కువగా ఉన్నారు. అయితే ఈ పరిస్థితి శాశ్వతంగా ఒకే విధంగా ఉండదు. తూర్పు ఐరోపా కొన్ని దేశాల్లో గతంలో రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా, ప్రస్తుతం పురుషుల వలసలు, జీవిత కాలం ఎక్కువగా ఉన్నందున మహిళల సంఖ్య ఎక్కువగా ఉంది. మధ్య ప్రాచ్య దేశాల్లో కార్మికులుగా పురుషులు ఇతర దేశాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన కారణంగా అక్కడ మహిళల శాతం తక్కువగా ఉంది. వర్తమాన పార్లమెంటులో చివరి బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రవేశపెట్టబోయే బడ్జెట్ బ్రహ్మాండమైన నారీశక్తి (మహిళా సాధికారత) అవుతుందని చెప్పారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ 'మహిళా సాధికారత పండగ' అని కూడా వర్ణించారు. నూతన పార్లమెంటు భవనంలో జరిగిన తొలి సమావేశంలో నారీశక్తి అభియాన్‌కు ఆమోదాన్ని చూశారని, జనవరి 26న కర్తవ్యపథ్‌లో మహిళాశక్తిని చూశారని అన్నారు. గతంలో బేటీ బచావో, బేటీ పఢావో అని పిలుపు ఇచ్చారు. దాని ఫలితం ఏమిటో పైన చూశాము. 'ఇండియా టుడే' వెబ్‌సైట్ 2023 జూన్ పదకొండున రోషిణీ చక్రవర్తి రాసిన విశ్లేషణకు 'భారత్‌లో తగ్గుతున్న మహిళా శ్రామికులు, ఎందుకు మహిళలు పని చేయటం లేదు' అనే శీర్షిక పెట్టింది. భారత్‌లో వేతనాలు చెల్లించే ఉపాధిలో మహిళలు ఇరవై శాతానికి లోపుగానే ఉన్నట్లు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదికను దానిలో ఉటంకించారు. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం ఉపాధిలో కేవలం 19.2 శాతం మంది మాత్రమే మహిళలు ఉండగా పురుషుల్లో 70.1 శాతం ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక లింగ అసమానతల నివేదిక 2022 ప్రకారం 146 దేశాల జాబితాలో 135వ స్థానంలో భారత్ ఉంది. ప్రపంచ శ్రామిక శక్తిలో లింగ సమానత్వం రావాలంటే 132 సంవత్సరాలు పడుతుందని ఆ నివేదిక పేర్కొన్నది. అట్టడుగున ఉన్న మన దేశానికి ఇంకా ఎక్కువ వ్యవధి పడుతుందని వేరే చెప్పనవసరం లేదు. 2005లో 32 శాతంగా ఉన్న మహిళా శ్రామిక శక్తి 2021 నాటికి 19.2 శాతానికి తగ్గింది.

అధికారిక సమాచారాన్ని విశ్లేషించినపుడు 2004లో గరిష్టంగా 35 శాతం మంది మహిళలు ఉపాధి పొందగా 2022 నాటికి అది 25 శాతానికి తగ్గినట్లు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆర్థికవేత్త రోజా అబ్రహం చెప్పారు. సిఎంఐఇ ఉపాధి నిర్వచనం ప్రకారం 2022లో పని చేసే వయస్సులో ఉన్న వారిలో కేవలం పది శాతం మంది మాత్రమే అంటే 3.9 కోట్ల మంది మాత్రమే పని చేస్తూ ఉండటం లేదా పని కోసం ఎదురు చూస్తున్నవారు వున్నారని, అదే పురుషుల విషయానికి వస్తే 36.1 కోట్ల మంది ఉన్నట్లు పేర్కొంది. పని చేయగలిగిన వారి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి పెరగటం లేదని, గత దశాబ్దిలో మంచి ఉద్యోగాలు గణనీయంగా తగ్గినట్లు, తక్కువ వేతనాలతో పని చేయటం కంటే ఇంటి దగ్గర ఉండి ఇల్లు, పిల్లలను చూసుకోవటం మరింత లాభదాయకమని వారి కుటుంబాలు భావిస్తున్నారని సిఎంఐఇ డైరెక్టర్ మహేష్ వ్యాస్ చెప్పారు. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పదిశాతం పెరిగితే జిడిపి 552 బిలియన్ డాలర్ల మేరకు అదనంగా పెరుగుతుందని 2018లో 'మెకెన్సీ' నివేదిక పేర్కొన్నది. 'క్వాల్‌ట్రిక్స్ డాట్‌కామ్' సమాచారం ప్రకారం 2022లో ప్రపంచంలోని 180 దేశాలలో శ్రామిక శక్తిలో 52.7 శాతం మహిళలతో ఆర్మేనియా మొదటి స్థానంలో ఉంది. ప్రపంచ సగటు 39.49 శాతం. మన దేశం 23.54 శాతంతో 166వ స్థానంలో ఉంది. మనకంటే ఎగువన 147లో నేపాల్, 153, 156 స్థానాలలో శ్రీలంక, బంగ్లాదేశ్, దిగువున 168వ స్థానంలో పాకిస్తాన్ ఉంది. మనతో జనాభాలో పోటీ పడుతున్న చైనా 45.17 శాతంతో 89వ దేశంగా ఉంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఏం చేశారని ఓట్లు అడుగుతున్నట్లు? కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో బిజెపి లేదా దానితో జత కట్టిన వారి ప్రభుత్వాలే ఉన్నాయి. కనుక అతివల స్థితి అధ్వానంగా ఉండటానికి కారకులు ఎవరంటే...మోడీని చూసి ఓటు వేయాలని బిజెపి చెబుతున్నందున...మోడీనే అని చెప్పాల్సి వస్తుంది. కాదంటారా ?

జనవాక్యం

సామన్యుడి కోసం రైళ్లేవీ!

రైళ్ళు ఎవరి కోసం నడుపుతున్నారో అర్థం కావటంలేదు. ఈ మధ్య అన్నీ ఎ.సి రైళ్ళు నడుపుతున్నారు. వందేభారతం, వందే మాతరం అంటూ ఎ.సి లోనే డబల్ డెక్కర్ అంటూ సామాన్యుడు ఎక్కలేని రైళ్లవేస్తున్నారు. రేపు కొత్తగా విశాఖ నుండి హైదరబాద్, విశాఖ పూరి నడుపుతారట. ఈ రైళ్ల వస్తుంటే మిగతా రైళ్ల పక్కకు తప్పుకొని వీటికి దారి ఇవ్వాలి. ఈ ఎ.సి రైళ్లలో కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆధికారులు... వీళ్ళందరికీ ఫ్రీ సర్వీసు. ప్రజాధనంతో వీళ్ల ప్రయాణం చేస్తుంటారు. ఇంకా బాగా డబ్బున్నవాళ్లు ఈ రైళ్ళు ఎక్కుతారు. సామాన్యుడు వీటి ముఖం కూడా చూడరు. డబల్ డెక్కర్ అనేది ఎ.సి ప్రయాణికులకేనా? పాసెంజర్ రైళ్ళు డబల్ డెక్కర్ వెయ్య కూడదా...గతంలో హైదరబాద్ నగరంలో డబల్ డెక్కర్ సిటీ బస్సులు ఉండేవి. అవి ఎక్కితే అదో రకం అనుభూతి కలిగేది. ఆ డబల్ డెక్కర్ రైళ్ళు మాములు పాసెంజర్ రైళ్లకు ఏర్పాటు చెయ్యండి. ఎ.సి రైళ్ల వేసి ఆదాయం బాగా పెంచుకుంటు న్నారు. మరి సీనియర్ సిటిజన్లకి గతంలో మాదిరి రాయితీ ఎందుకు ఇవ్వరూ? ఎన్నికలు వస్తున్నాయని ఆకాశానికి పెంచిన గ్యాస్ రేటును వంద రూపాయలు తగ్గించారు. ఎందుకు తగ్గించిందీ జనాలకు తెలుసు. కనుక ఇప్పటికైనా పాసెంజర్ రైళ్ల పెంచండి. ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలుకి సగం జనరల్ బోగీలు తగిలించండి. సీనియర్ సిటిజన్లకి టికెట్ ధరలో రాయితీ పునరుద్ధరించండి. అప్పుడే కేంద్ర బిజెపి పాలకులను జనం నమ్ముతారు.

– నార్నె వెంకట సుబ్బయ్య

హింసకు తావు లేకుండా..రీపోల్ అవసరమే రాకుండా..!

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఇవే ప్రధానం ● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హింసకు తావు లేకుండా...ఎన్నికలు తిరిగి నిర్వహించే అవసరం రాకుండా (జీరో వయలెన్స్...నో రీపోల్), పూర్తి స్వేచ్ఛగా, సజావుగా ఈ దఫా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. ఇదే లక్ష్యంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశాల్లో ఎటువంటి తేడా వచ్చినా అందుకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, కమిషనర్లతో సచివాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్టంగా పనిచేసే విధంగా ముందుగానే తగు ఏర్పాట్లు చేసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా పోస్టల్ ద్వారానే బట్వాడా చేయాలని, పాడేరు ప్రాంతం మినహా మరే ఇతర ప్రాంతాల్లో మాన్యువల్‌గా పంపిణీ చేయడానికి వీలులేదని తెలిపారు. ఓటర్లను ఆకర్షించేందుకు పలు పార్టీలు నగదు, బహుమతులను విరివిగా పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత నివేదికలు వెంటనే పంపించాలని ఆదేశించారు.



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

వేగవంతంగా ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ

త్వరలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో పెండింగ్ ఫారాలు పరిష్కారం, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ముఖేష్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు కచ్చితమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల ఎస్‌పిలతో ఆయన సమీక్ష జరిపారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ ఏరియాల్లో పోలీసు సిబ్బందిని నియమించాలని, ఎంతమంది కావాలో ముందే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. చిన్నచిన్న ఘటనలను కూడా ఉపేక్షించవద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్ర పోలీసుశాఖ ఏర్పాట్ల గురించి అదనపు డిజిపి శంఖబ్రత బాగ్చి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు సిఇఒ ఎమ్‌ఎన్ హరేంధిర ప్రసాద్, డిప్యూటీ సిఇఒలు కె విశ్వేశ్వరరావు, ఎస్ మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేహదానం చేసిన సురేశ్ ఆదర్శనీయుడు

● జెవివి ఘన నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన జీవిత కాలంలో నిస్వార్థంగా సమాజ మార్పు కోసం కృషి చేసిన సురేశ్ తన మరణానంతరం కూడా దేహదానంతో మరింత గొప్ప ఆదర్శాన్ని నెలకొల్పారని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్ పేర్కొన్నారు. శరీర దానంతో మనిషి జీవిత కాలాన్ని పెంచడమేగాక, మెడికల్ కాలేజీలకు అవయవ దానం చేస్తే మరింతమంది నైపుణ్యం కలిగిన వైద్యులు తయారవుతారని వారు తెలిపారు. తద్వారా మనం చనిపోయినా నలుగురికి విజ్ఞానాన్ని అందించడానికి ఉపయోగపడతామని చెప్పారు. దేహదానంతో వైద్య విద్యార్థులకు పాఠాలు నేర్పించవచ్చన్నారు. జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య సబ్ కమిటీ కన్వీనర్ అనుమకొండ సురేశ్ (బ్రెయిన్ క్యాన్సర్ బారినపడి మంగళవారం మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని తన అంతిమ కోరిక మేరకు సిద్దిపేటలోని సురభి వైద్య కళాశాలకు ఆయన కుటుంబ సభ్యులు అప్పగించారు. సురేశ్ పార్థివ దేహాన్ని సురభి వైద్య కళాశాల అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సమత రొమ్మి స్వీకరించారు. ఈ సందర్భంగా సురేశ్ భార్య పద్మ, కుమార్తె సునయన, అల్లుడు లోకనాథంను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కమిటీ, పలు జిల్లా కమిటీలు సురేశ్ కు ఘనంగా నివాళులు అర్పించారు. డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్ మాట్లాడుతూ... వైద్యరంగం దినదినాభివృద్ధి చెందుతుందని, వివిధ మానవ అవయవాల మార్పిడి చేయగల స్థాయికి వైద్య శాస్త్రం ఎదిగిందని గుర్తుచేశారు.

తేనె కొనుగోలు ధరను పెంచిన జిసిసి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి కాలనీ

గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి సేకరిస్తున్న తేనె కొనుగోలు ధరను కిలో ఒక్కింటికి రూ.200 నుంచి రూ.250కు పెంచినట్లుగా సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. తేనెను సేకరించేటప్పుడు తప్పనిసరిగా ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ ప్రమాణాలను పాటించాలని కొనుగోలు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తేనె సేకరించు గిరిజనులకు గుర్తింపు కార్డులు అందజేయాలని నిర్ణయించి నట్లు, గిరిజనుల నుంచి సేకరించు తేనెకు చెల్లించే సొమ్మును వారి ఖాతాలలో నేరుగా జమ చేయుటకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, తిరుపతి, శ్రీశైలం డివిజన్లలో తేనె అధిక మొత్తంలో లభ్యమవుతుందని తెలిపారు.

నేడు ధర్నాల్లో పాల్గొనాలి

- కార్మికవర్గానికి సిఐటియు రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంఘీభావంగా జిల్లా, మండల కేంద్రాల్లో గురువారం పెద్దయెత్తున ధర్నాలు చేపట్టనున్నాయని, కార్మికవర్గం ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సిఐటియు రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతాంగానికి కేంద్రం రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. అలాగే కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని వివరించారు. కార్మికుల, రైతులు హక్కులు కాలరాస్తోందని, గిట్టుబాటు ధరకు మద్దతు కల్పించడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గంలోని అనేక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 14న జరిగే ధర్నాలో అందరూ పాల్గొనాలని వారు కోరారు.

సచివాలయంలో టైపిస్టులు రద్దు

- ఇకపై వారు సెక్షన్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర సచివాలయంలో ఇన్నాళ్లూ పనిచేసే టైపిస్ట్-అసిస్టెంట్ పోస్టులు ఇకపై కనిపించవు. వీటిని ఇకపై సెక్షన్ అసిస్టెంట్ పోస్టులుగా మార్పు చేయనున్నారు. దశాబ్దాలుగా టైపిస్టులుగా చాలా మంది పనిచేస్తున్నారు. కొన్నేళ్లుగా పాలనలో చోటుచేసుకుంటున్న సాంకేతిక అభివృద్ధి, మారుతున్న సర్వీసు నిబంధనలు, పోస్టులకు మారుతున్న విద్యార్హతలు వంటి వాటి కారణాలు టైపిస్టులపైనా ప్రభావం చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే 2018లోనే రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. పనిచేస్తున్న టైపిస్టుల విద్యార్హతలు, వారి నైపుణ్యం వంటివి పరిగణనలోకి తీసుకున్న కమిటీ వారిని ఇకపై సెక్షన్ అసిస్టెంట్లుగా మార్పు చేసేందుకు సిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులు ఆధారంగానే ఇకపై ఆ పోస్టులను సెక్షన్ అసిస్టెంట్లుగా మార్చాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

చిలకలూరిపేటలో మల్లెల మద్దతుదారుల నిరసన

- రాజేష్ నాయుడును కొనసాగించాలని డిమాండ్

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో వైసిపి కార్యకర్తలు బుధవారం ఆందోళనకు దిగారు. చిలకలూరిపేట సమన్వయకర్తగా ఉన్న మల్లెల రాజేష్ నాయుడును తొలగిస్తూ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆయన అనుచరులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి రజినికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిలకలూరిపేట సమన్వయకర్తగా రాజేష్ నాయుడును కొనసాగించాలని డిమాండ్ చేశారు. నగరంలోని బ్యాంకు కాలనీలో ఉన్న మల్లెల కార్యాలయం నుండి బయలుదేరిన ర్యాలీని మంత్రి విడదల రజిని ఇంటివైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు వైసిపి కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు సర్ది చెప్పడంతో అక్కడి నుండి ఎన్‌ఆర్‌టి సెంటర్, కళామందిర్, ఎన్‌జిరంగా బొమ్మ వరకు సాగింది. మల్లెల స్థానంలో గుంటూరు మేయర్ కావటి మనోహరనాయుడును నియమిస్తూ అధిష్టానం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేయడంతో ఆందోళన చెందిన కొంత మంది కార్యకర్తలు ఎన్‌ఆర్‌టి సెంటర్‌లో మోటార్ సైకిల్‌ను దహనం చేశారు. నిరసన ర్యాలీలో 6, 7, 10, 12 వార్డుల కౌన్సిలర్‌లు గోల్డ్ శ్రీనివాసరావు, శివపార్వతి, బేరింగుల మౌలాలి, గోపి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్న బిజెపి

సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు • తొలి తరం కమ్యూనిస్టు నేత తరుణాచారి స్మారక స్తూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత సామరస్యాన్ని దెబ్బతీస్తోందని సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం మామిడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన తొలితరం కమ్యూనిస్టు నేత గానుగుల తరుణాచారి స్మారక స్తూపాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మధు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం ముస్లిముల పట్ల తీవ్ర వివక్ష చూపేలా పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీనిపై ముస్లిముల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా నాడు సాగిన జాతీయోద్యమ స్ఫూర్తిని బిజెపి దెబ్బతీస్తోందన్నారు. మోడీ పదేళ్ల పాలనలో అన్ని తరగతుల ప్రజలూ తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు అందించే ఎరువులు, విత్తనాలపై సబ్సిడీలు ఎత్తేశారని గుర్తు చేశారు. వామపక్షాలు పోరాడి సాధించిన అటవీ హక్కుల చట్టానికి మోడీ తూట్లు పొడుస్తున్నారన్నారు. గిరిజనులకు జీవనాధారంగా ఉన్న కొండలను, అడవులను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని మోడీ ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలో రైతు ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించడంలో గానుగుల తరుణాచారి కీలక భూమిక పోషించారని తెలిపారు. మందస జమిందారీ పోరాటంతో ఈ ప్రాంతంలో కమూనిస్టు ఉద్యమం ప్రారంభమైందని, దీనికి తరుణాచారి, మార్పు పద్మనాభం, బెందాళం గవరయ్య నాయకత్వం వహించారని వివరించారు. నేటి యువతరం ఆ పోరాటాల స్ఫూర్తితో మోడీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. మామిడిపల్లి గ్రామ కూడలి వద్ద తొలుత కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి మధు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, ప్రజా నాట్య మండలి కళాకారుల పాటలతో సభా వేదిక అయిన గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రానికి ర్యాలీగా వెళ్లారు. గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు జుత్తు సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కేంద్రం ఛైర్మన్ పాతిని కృష్ణమూర్తి, కె.మోహనరావు, ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తరుణాచారి స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న పి.మధు

తండ్రి మరణం.. కన్నీళ్లతో పరీక్ష రాసిన విద్యార్థిని

ప్రజాశక్తి- హిందూపురం

అల్లారు ముద్దుగా చూసుకున్న తండ్రి అకస్మాత్తుగా మరణించాడు. ప్రతిరోజూ పరీక్ష కేంద్రానికి ద్విచక్రవాహనంలో తీసుకెళ్లే తండ్రి విఘతజీవిగా ఇంట్లో ఉన్నాడు. కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతం అవుతున్న వేళ దుఃఖాన్ని దిగమింగుకుని ఇంటర్ పరీక్షకు హాజరయ్యారు ఆ విద్యార్థిని. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో చోటు చేసుకున్న ఈ విషాధ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... హిందూపురం పట్టణానికి చెందిన సిద్ధా(46) ఈనాడులో సీనియర్ జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె తస్లీమ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుండెపోటుతో సిద్ధా మంగళవారం మరణించారు. రాత్రంతా తండ్రి మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమైన తస్లీమ్.. బుధవారం ఉదయాన్నే పరీక్ష కేంద్రానికి హాజరయ్యారు. బాగా చదువుకోవాలని తండ్రి చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుని.. దుఃఖాన్ని దిగిమింగుకుని ఫిజిక్స్ పరీక్షను పూర్తి చేశారు. అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


పరీక్షకు హాజరైన విద్యార్థిని తస్లీమ్


కెజిహెచ్ వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు నర్సులు

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆస్పత్రి, విక్టోరియా ఆస్పత్రుల ఎదుట కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు నిరసన తెలిపారు. రెగ్యులర్ చేసేంత వరకు వందశాతం గ్రాస్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం ఇవ్వాలని, విధినిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియోతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇకపై రెగ్యులర్ విధానంలోనే నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ జిల్లా అధ్యక్షులు కె. సతీష్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నలుగురు స్టాఫ్ నర్సులను నియమించి, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఇహెచ్‌ఎస్‌ను ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నైట్ వాచ్‌మెన్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ నాయకులు తారకేశ్వరి, శైలజ, మురళీధర్, కాంట్రాక్ట్ నర్సులు పాల్గొన్నారు.

కుటుంబాలను చిదిమేస్తున్న అప్పులు

- భార్య మృతి, చికిత్స పొందుతున్న తండ్రి, కుమార్తె
- గుంటూరు జిల్లా తెనాలిలో విషాదం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

అప్పుల బాధ, కుమార్తె కాపురంలో చిచ్చురేగిందన్న మనస్తాపంతో ఓ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో నాజరుపేటలో బుధవారం చోటుచేసుకుంది. తెనాలి వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాజరుపేటకు చెందిన విష్ణుమొలకల శివశంకరరావు, ఆయన భార్య నాగమణి (55) పాలవ్యాపారంతో జీవనం సాగించేవారు. వ్యాపారంలో నష్టాలు, అప్పులు పెరిగిపోవడంతో ప్రత్యామ్నాయంగా స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో టీ స్టాల్ పెట్టుకున్నారు. అయినా అప్పుల భారం తీరలేదు. అదే సమయంలో వారి కుమార్తె చంటి హారికకు ఆమె భర్త, అత్త మామల నుండి వేధింపుల మొదలయ్యాయి. దీనిపై గతేడాది జూన్‌లో పట్టణ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పరస్పరం కేసులు కూడా నమోదయ్యాయి. ఈ క్రమంలో హారిక పుట్టింట్లోనే ఉంటున్నారు. ఓ వైపు అప్పుల భారం, మరోవైపు కుమార్తె కాపురం కుదటపడకపోవటంతో మనస్తాపానికి గురయ్యారు. మంగళవారం రాత్రి శివశంకరరావు భార్య, కుమార్తెతో కలిసి విష గుళికలు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు వారిని తెనాలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగమణి మృతి చెందారు. శివశంకరరావు, హారిక చికిత్స పొందుతున్నారు. పట్టణ ఒన్‌టౌన్ సిఐ, సిబ్బంది ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. సిఐ దశరథరామారావు మాట్లాడుతూ గతంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు విచారణలో ఉన్నాయని, ఆ కేసుల్లో న్యాయం జరగలేదని బాధితులు చెప్పడంలో వాస్తవంలేదని అన్నారు. ప్రస్తుతం బాధితుల ఫిర్యాదు మేరకు శివశంకరరావు అల్లుడు, వియ్యంకుడు, వియ్యపురాలిపైనా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఆస్పత్రి వద్ద నాగమణి బంధువుల ఆందోళన

ఆస్పత్రి నుంచి నాగమణి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఆమె బంధువులు నిరాకరించారు. నాగమణి కుమార్తెను వేధింపులకు గురిచేసిన ఆమె భర్త, అత్త మామలపై కేసు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పడంతో ఆందోళన విరమించారు.

వైసిపిలో ముద్రగడ చేరిక వాయిదా

ప్రజాశక్తి - కిర్లంపూడి (కాకినాడ జిల్లా)

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైసిపిలో చేరిక వాయిదా పడింది. ఈ మేరకు ఆయన బుధవారం ఒక లేఖను విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 14న తాడేపల్లిలో వైసిపిలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లాలని అనుకున్నామని గుర్తు చేశారు. అయితే, ఊహించిన దానికంటే భారీ స్థాయిలో స్పందన వచ్చిందని తెలిపారు. సిఎం కార్యాలయం వద్ద సెక్యూరిటీ ఇబ్బందుల కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశానని, దీనికి తనను క్షమించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 15, 16వ తేదీల్లో తానొక్కడేనే తాడేపల్లి వెళ్లి ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేరుతానని తెలిపారు. అందరి ఆశీస్సులు కోరుకుంటున్నానని లేఖలో పేర్కొన్నారు.

రూ.238 కోట్లతో కంపా పనులు

- అటవీకరణ, అగ్ని ప్రమాదాల నివారణ
- వన్యప్రాణి సంరక్షణలపైనా శ్రద్ధ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పరిహార అటవీకరణ (కంపా)కు వ్యయం చేయాలని రాష్ట్ర అటవీశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు రంగాల్లో రూ.238 కోట్ల వరకు ఖర్చు చేయాలని ప్రతిపాదించింది. ఈ పనుల్లో కొత్తగా అటవీకరణ, అడవుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ, వన్యప్రాణి సంరక్షణ వంటి అనేక అంశాల్లో ఈ నిధులను వ్యయం చేయాలని అధికారులు నిర్ణయించారు. మొత్తం రెండు కీలక విభాగాల ద్వారా ఈ నిధులు ఖర్చు చేయనున్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో కాంపన్సేటరీ ఆఫారెస్టేషన్ కింద రూ.65.90 కోట్లతో పనులు చేయాలని నిర్ణయించారు. ఏవైనా పథకాలకు, అభివృద్ధి పనులకు అటవీ భూములను కేటాయించాల్సి వస్తే, దానికి పరిహారంగా వేరేచోట అడవులను పెంచాల్సి ఉంటుంది. దీనికోసం భూములు తీసుకున్న సంస్థలు, శాఖలు కూడా కొంత నిధులు అందించాల్సి ఉంటుంది. ఈ నిధులకు తమ వాటాగా రూ.65.90 కోట్ల నిధులను జతచేసి అటవీశాఖ అడవిని పునరుద్ధరించాల్సి ఉంటుంది. అలాగే అదనపు పరిహార అటవీ అభివృద్ధి పేరిట మరో రూ.1.55 కోట్లను వ్యయం చేయాలని భావిస్తున్నారు. అటవీ ప్రాంతంలో సేఫ్టీ జోన్ అభివృద్ధి కింద రూ.1.11 కోట్లు, క్యాచ్‌మెంట్ ప్రాంత అభివృద్ధికి రూ.14.07 కోట్లు, వన్యప్రాణ నిర్వహణకు రూ.2.92 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించారు.

పోలవరం ప్రాంతంలోనూ..

పోలవరం ప్రాజెక్టు పరిధిలో 132 కెవి విద్యుత్ లైన్లు, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని 25 కెవి విద్యుత్ లైన్ల నిర్మాణ ప్రాంతాల్లో ఉన్న అడవిలో అభివృద్ధి కోసం రూ.32.83 కోట్లను వ్యయం చేయాలని నిర్ణయించారు. అలాగే కంపా నిధులతో మరికొన్ని ఉప రంగాల్లో కూడా రూ.129 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. సాధారణ, తాత్కాలిక అటవీ ప్రాంత అభివృద్ధి కోసం రూ.28 కోట్లు, అటవీ రక్షణ, కొత్త ప్లాంటేషన్ కోసం రూ.40 కోట్లు, అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల రక్షణ కోసం రూ.21 కోట్లు ఖర్చు చేయా లని నిర్ణయించారు. ఫారెస్ట్ కవర్ పెంచడం, అడవు ల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, అడవుల్లో కలప, వంటచెరకు రక్షణ, వన్యప్రాణుల కారిడార్లలో ఉండే అటవీయేతర భూముల్లో మొక్కలు పెంచడం వంటి అంశాలకు కూడా నిధులు ఖర్చు చేయాలని నిర్ణయించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, సి.హెచ్.పురుషోత్తం నాయుడు అన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు బుధవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కడపలోని ఇరిగేషన్ కాంపౌండ్ నుంచి సంధ్య సర్కిల్ మీదుగా జడ్‌పి సమావేశ మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. 12 పిఆర్‌సి, పెండింగ్ డిఎలు, జిపిఎఫ్, ఎపిజిఎల్‌ఐ పెండింగ్ బిల్లులు, పెన్షనర్స్ సమస్యలు, సరెండర్ లీవ్‌లు, ఉపాధ్యాయ, వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మూడు సంవత్సరాలు పనిచేసి, అన్ని జిల్లాల మద్దతుతో ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షులుగా శివారెడ్డి ఎన్నికయ్యారని చెప్పారు. రాష్ట్ర సహాధ్యక్షులు దస్తగిరిరెడ్డి, ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు జగదీష్, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల అధ్యక్షులు, ఆర్‌టిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పునాదిపైనే దాడి

- సిఎఎపై సర్వత్రా విమర్శలు

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకొచ్చిన సిఎఎను 'దేశ రాజ్యాంగం యొక్క పునాదిపై దాడి'గా సిపిఎం నాయకులు ఎంవై తరిగామి విమర్శించారు. 'దేశ రాజ్యాంగానికి లౌకిక ప్రజాస్వామ్యం పునాది. అయితే దురదృష్టవశాత్తూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా రాజ్యాంగంలోని లౌకిక లక్షణాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి దిగుతోంది. జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా విషయంలో కూడా అదే జరిగింది. ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన సిఎఎ ద్వారా కూడా మైనార్టీలను లక్ష్యంగా చేసుకునేందుకు అడుగువేశారు' అని తరిగామి విమర్శించారు.



సిఎఎ అనేది పౌరుల రాజ్యాంగ విలువలను లక్ష్యంగా చేసుకుంటుందని తరిగామి ఆరోపించారు. ఈ చట్టం వచ్చినప్పుడే దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయని, అయినా త్వరలో లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ మైనార్టీ వ్యతిరేక చట్టాన్ని తీసుకొచ్చారని, ఇది ప్రజల మధ్య విభజన తేవడానికి ప్రయత్నమని విమర్శించారు. ఈ చట్టం తమకు ఆమోదయోగ్యం కాదని సిపిఎం ఇప్పటికే స్పష్టం చేసిందని తరిగామి గుర్తు చేశారు. కేరళ వంటి సిపిఎం పాలిత రాష్ట్రాలు సిఎఎను అమలు చేయబోమని తమ వైఖరిని వెల్లడించాయని కూడా తరిగామి తెలిపారు.

సిఎఎతో వలసలు పెరుగుతాయి : కేజ్రీవాల్

పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ)పై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నిప్పులు చెరిగారు. ఎన్నికలకు ముందు ఓటు బ్యాంకు రాజకీయాలే లక్ష్యంగా కేంద్రం సిఎఎను అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. 'ఇదో మురికి ఓటు బ్యాంకు రాజకీయం. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారులకు పౌరసత్వం ఇచ్చి వారికి బిజెపి బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆశ్రయం కల్పిస్తుంది. దీనివల్ల భవిష్యత్‌లో బిజెపికి ఓటు బ్యాంకు పెరుగుతుంది. వారి రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని' మండిపడ్డారు. 'ఇప్పటికే దేశంలో ఉన్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సమస్యలను పరిష్కరించకుండా సిఎఎ గురించి కేంద్రం మాట్లాడుతోంది. 2014కు ముందు భారత్‌కు వచ్చిన వారికి పౌరసత్వం ఇస్తామంటున్నారు. కాని ఒకసారి తలుపులు తెరిచిన తరువాత మిగిలినవారు ఊరుకుంటారా... పెద్ద సంఖ్యలో వలసదారులు భారతదేశంలోకి రావడం ప్రారంభిస్తారు. మూడు దేశాల్లో 30 మిలియన్లకు పైగా మైనారిటీలు నివసిస్తున్నారు. 15 మిలియన్ల మంది భారత్‌కు వచ్చినా వారు ఎక్కడ స్థిరపడతారు, వారికి ఉద్యోగాలు ఎవరు ఇస్తారు. ఇది దేశానికి ప్రమాదకరం. ఇప్పటికే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు రావడం వల్ల అస్సాం ప్రజల భాష, సంస్కృతి ఇబ్బందుల్లో పడ్డాయని" ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

సిఎఎను అందుకే వ్యతిరేకిస్తున్నాం : మమత

సిఎఎ అనేది జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌సిఆర్)తో ముడిపడి ఉందని, అందుకే సిఎఎను వ్యతిరేకిస్తున్నామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి చీఫ్ మమతా బెనర్జీ బుధవారం తెలిపారు. అలాగే, అస్సాంలో మాదిరిగా పశ్చిమ బెంగాల్‌లో డిటెన్షన్ క్యాంపులు (నిర్బంధ శిబిరాలు) తాము కోరుకోవడం లేదని చెప్పారు. అలాగే లోక్‌సభ ఎన్నికలకు ముందు సిఎఎను అమలు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడాన్ని ఒక రాజకీయ జిమ్మిక్‌గా మమత విమర్శించారు. అలాగే టిఎంసి ప్రకటించిన లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులకు వ్యతిరేకంగా విమర్శలు చేసినందుకు తన సోదరుడు బాబూన్ బెనర్జీపై కూడా మమత బెనర్జీ విమర్శలు చేశారు. అతనితో అన్ని సంబంధాలను వదులుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. 'నేను, నా కుటుంబం అతనితో అన్ని సంబంధాలను వదులుకున్నాం. నేను అత్యాశపరులను ఇష్టపడను. అతను చెప్పింది నేను విన్నాను. అతను బిజెపితో టచ్‌లో ఉన్నాడు. అతను కోరుకున్నది చేయగలడు. దయచేసి మాతో అతన్ని కలపవద్దు' అని మమతా బెనర్జీ తెలిపారు.

వివక్షాపూరితం

సిఎఎపై ఐరాస, అమెరికా ఆందోళన

న్యూయార్క్ : కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై అంతర్జాతీయ సమాజం నుంచీ ఆందోళన వ్యక్తమవుతునది. సిఎఎ అమలు నిబంధనల నోటిఫికేషన్‌పై అమెరికా, ఐక్యరాజ్యసమితి(యూఎన్) ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయాన్ని 'రాయిటర్స్' నివేదించింది. " పౌరసత్వ సవరణ చట్టం ప్రాథమికంగా వివక్షాపూరితమైనది. భారతదేశ అంతర్జాతీయ మానవ హక్కుల బాధ్యతలను ఉల్లంఘించేది" అని యూఎన్ ఆందోళన చెందుతున్నదని ఐక్య రాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం ప్రతినిధి వివరించారు. నిబంధనలు అంతర్జాతీయ మానవ హక్కుల చట్టానికి లోబడి ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధ్య యనం చేస్తున్నామని పేర్కొన్నారు. యునైటెడ్ స్టేట్స్ స్టేట్ డిపార్ట్ మెంట్ కూడా నిబంధనల నోటిఫికేషన్ గురించి ఆందోళన చెందు తున్నట్టు వివరించింది. ఈ చట్టం ఎలా అమలు చేయబడుతుందో పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొన్నది. మత స్వేచ్ఛను గౌరవించటం, అన్ని వర్గాలను సమానంగా చూడటం ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలు అని రాష్ట్ర శాఖ ప్రతినిధి వివరించారు.

వామపక్షాలతో కలిసి ముందుకు..

- 175 స్థానాల్లోనూ పోటీ
- ఢిల్లీలో వైఎస్ షర్మిల వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వామపక్షాలతో కలిసి ముందుకెళ్తామని, ఈ దిశగా సిపిఎం, సిపిఐతో చర్చలు జరుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎపిపిసిసి) అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రంలో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు బుధవారం నాడిక్కడ ఎఐసిసి కార్యాలయంలో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ..రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ పోటీ చేస్తామన్నారు. ఇప్పటికే పోటీ చేసేందుకు 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇదే రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందనడానికి నిదర్శనమన్నారు. బిజెపితో చేతులు కలిపి ప్రాంతీయ పార్టీలు నియంతలా తయారవుతున్నాయని విమర్శించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క శాతం మాత్రమే ఓట్లు వచ్చాయని, ఈ సారి అలా జరగబోదని తెలిపారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలమన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలే లక్ష్యంగా ప్రభుత్వాలను ప్రశ్నిస్తామని తెలిపారు.

కలబురగి నుంచి మోడీ ఎన్నికల శంఖారావం

బెంగళూరు : త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం ఈ నెల 16న కర్ణాటకలోని కలబురగి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కర్ణాటక బిజెపి ప్రధాన కార్యదర్శి వి.సునీల్ కుమార్ బుధవారం వెల్లడించారు. కలబురగి అనేది కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే సొంత నియోజకవర్గం. 2009, 2014 ఎన్నికల్లో ఇక్కడ నుంచి ఖర్గే విజయం సాధించారు. అయితే 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఈ ఏడాది ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి పోటీచేయనున్నారని సమాచారం. ఈ నెల 16న కలబురగిలోని ఎన్‌వి ప్లేగ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో మోడీ పాల్గొంటారని, 18న శివమొగ్గలో జరిగే బహిరంగ సభకు మోడీ హాజరవుతారని సునీల్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

బిజెపి రెండో జాబితా

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు 72 మందితో రెండో జాబితాను బిజెపి బుధవారం విడుదల చేసింది. ఈ జాబితాలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషీ, పీయూష్ గోయల్, అనురాగ్ ఠాకూర్, శోభా కరంద్లాజేతో పాటు మాజీ సీఎంలు మనోహర్‌లాల్ ఖట్టర్, త్రివేంద్రసింగ్ రావత్, బసవరాజ్ బొమ్మై వంటి ప్రముఖులకు చోటు లభించింది. తెలంగాణ నుంచి ఆరుగురికి చోటు దక్కింది. ఆదిలాబాద్ - గోడెం నగేశ్, పెద్దపల్లి - గోమాస శ్రీనివాస్, మెదక్ - రఘునందన్‌రావు, నల్లగొండ - శానంపూడి సైదిరెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, మహబూబాబాద్‌కు సీతారాం నాయక్‌ను అభ్యర్థులుగా ప్రకటించారు. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. మొదటి జాబితాలో 9 మందిని ప్రకటించిన విషయం తెలిసిందే.

మహారాష్ట్రలో ఎనిమిది రైల్వే స్టేషన్ల పేర్లు మార్పు?

న్యూఢిల్లీ : ముంబయిలోని ఎనిమిది రైల్వే స్టేషన్ల పేర్లను మార్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని శివసేన ఎంపీ రాహుల్ షెవాలే అన్నారు. ముంబై సెంట్రల్ స్టేషన్ పేరును నానా జగన్నాథ్ శంకర్‌షేత్ స్టేషన్‌గా, కర్రీ రోడ్‌కి లాల్‌బాగ్‌గా, శాండ్‌హర్స్ట్ రోడ్‌కి డోంగ్రీగా, మెరైన్‌లైన్స్‌ను ముంబదేవిగా, చర్ని రోడ్‌కి గిర్‌గావ్‌గా, కాటన్ గ్రీన్ పేరు కాలాచౌకీగా, డాక్‌యార్డ్‌ను మజ్‌గావ్‌గాను, కింగ్స్ సర్కిల్‌కు తీర్థంకర్ పార్శ్వనాథ్ అని పేరు మార్చనున్నట్లు చెప్పారు. ' రైల్వే స్టేషన్ల పేర్లను మార్చాలని ముంబైకర్ల నుంచి డిమాండ్ ఉంది. ఈ భావాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశాను. ఈ డిమాండ్‌కు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినం దుకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకి ధన్యవాదాలు" అని ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదిం చిన తర్వాత ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని షెవాలే తెలిపారు.

మాది కీలుబొమ్మ ప్రభుత్వమే !

- నవాజ్ పార్టీ సీనియర్ నేత

లాహోర్ : పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పిఎంఎల్-ఎన్) నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం సైన్యం చేతిలో కేవలం కీలు బొమ్మ మాత్రమేనని మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సన్నిహితుడొకరు అంగీకరించారు. పరోక్షంగా, సైన్యమే ప్రభుత్వాన్ని నడుపుతుందని సూచనప్రాయంగా తెలిపారు. దీనిపై పిఎంఎల్-ఎన్ నుండి ఎలాంటి స్పందన రాలేదు. మాజీ మంత్రి మియాన్ జావెద్ లతీఫ్ మంగళవారం ఒక ప్రైవేట్ టివి చానెల్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరి 8న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్‌లో అవసరమైన సాధారణ మెజారిటీని కూడా తమ పార్టీ సాధించలేకపోయిందని చెప్పారు. ఇక్కడా, అక్కడా సీట్లన్నీ పోగేసి వారు (సైన్యం) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దాన్ని మీరు పిఎంఎల్-ఎన్ ప్రభుత్వంగా పిలవచ్చు కానీ వాస్తవానికి, అది ఒక కీలుబొమ్మ ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. ఎక్కడ అసలైన అధికారం వుందో ప్రతి ఒక్కరికీ తెలుసని అన్నారు. ప్రభుత్వాన్ని ఎవరు నడిపినా, వారి విధానాల తాలుకూ భారాన్ని మోయాల్సింది పిఎంఎల్-ఎన్ మాత్రమేనని అన్నారు.

లేఖ రాసేందుకు అధికారం ఇవ్వలేదు

- ఎన్నికల బాండ్లపై రాష్ట్రపతికి లేఖపై
- సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వివరణ

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేయాలంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అదిష్ అగర్వాల రాసిన లేఖ గందరగోళం సృష్టించిన నేపథ్యంలో ఆ సంఘం వివరణ ఇచ్చింది. రాష్ట్రపతికి లేఖ రాసేందుకు తాము అగర్వాలకు అధికారం ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల వ్యవహారంపై న్యాయస్థానం మరోసారి విచారణ జరిపే వరకూ సుప్రీంకోర్టు తీర్పును నిలిపివేయాలని మంగళవారం ముర్ముకు రాసిన లేఖలో అగర్వాల విజ్ఞప్తి చేశారు. 'రాజ్యాంగపరమైన ప్రతిష్టంభనను కలిగించే విధంగా తీర్పులు వెలువరించడానికి సుప్రీంకోర్టును అనుమతించకూడదు. పార్లమెంట్ ఔన్నత్యాన్ని దెబ్బతీసే విధంగా తీర్పులు ఇవ్వడాన్ని అనుమతించకూడదు. పార్లమెంటులో ప్రజాప్రతినిధులందరూ కలిసి తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడాన్ని అనుమతించకూడదు. రాజకీయ పార్టీల పనితీరును ప్రశ్నించేలా తీర్పులు ఇవ్వకూడదు' అని ఆయన ఆ లేఖలో అభిప్రాయపడ్డారు. వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన కార్పొరేట్ సంస్థల వివరాలను బహిర్గతం చేస్తే అవి కక్షసాధింపు చర్యలకు గురయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ లేఖపై బార్ అసోసియేషన్ స్పందిస్తూ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ఆల్ ఇండియా బార్ అసోసియేషన్ ఛైర్మన్ హోదాలో అగర్వాల ఈ లేఖ రాసినట్లు కన్పిస్తోందని తెలిపింది. అయితే కమిటీ సభ్యులు ఆయనకు అలా లేఖ రాసే అధికారం ఇవ్వలేదని, అంతేకాక ఆ లేఖలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలను వారెవ్వరూ సమర్థించడం లేదని స్పష్టం చేసింది. అగర్వాల్ చర్య, ఆయన రాసిన లేఖలోని వివరాలు సుప్రీంకోర్టు అధికారానికి భంగకరంగా ఉన్నాయని, ఈ చర్యను తాము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నామని బార్ అసోసియేషన్ ఆ తీర్మానంలో తెలియజేసింది.

ఎఐఎడిఎంకె-బిజెపి మధ్య రహస్య పొత్తు: స్టాలిన్

చెన్నై : ఎఐఎడిఎంకె-బిజెపి మధ్య రహస్య పొత్తు ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె నాయకులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. ఈ రెండు పార్టీలను ఓడించడానికి ఇండియా వేదిక కృషి చేస్తోందని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనే కాదు, ఏ ఎన్నికలు వచ్చినా ఇండియా కూటమిదే విజయమని విశ్వాసం వ్యక్తం చేశారు. పొల్లాచ్చిలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొంగు ప్రాంతాన్ని తమ కంచుకోటగా ఎఐఎడిఎంకె గొప్పగా ప్రచారం చేసుకుంటుందని, కానీ ఈ ప్రాంతానికి ఆ పార్టీ ఏమీ చేయలేదని స్టాలిన్ విమర్శించారు. పొల్లాచ్చి లైంగిక వేధింపుల కేసును అప్పటి ఎఐఎడిఎంకె ప్రభుత్వం నీరుగార్చిందని, 13 మంది ప్రాణాలు కోల్పోయిన తూత్తుకుడి కాల్పుల ఘటన ఎఐఎడిఎంకె ప్రభుత్వ హయంలోనే జరిగాయన్నారు. అలాగే తమిళనాడు ప్రజలకు మోడీ ప్రభుత్వం కూడా ఏమీ చేయలేదని, హామీలతోనే మోడీ ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటుపై హామీని కూడా నిలబెట్టుకోలేదని ఆరోపించారు. వచ్చే వారంలో తమిళనాడు పర్యటనకు రానున్న ప్రధాని మోడీని ఈ హామీలపై ప్రశ్నించాలని ప్రజలకు స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 57,325 మంది లబ్దిదారులకు సంక్షేమ సహాయాన్ని స్టాలిన్ పంపిణీ చేశారు. కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, నీలగిరి జిల్లాల్లో చేపట్టే రూ. 1,273.51 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు స్టాలిన్ శంకుస్థాపన చేశారు.

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్‌లో 250 స్టార్టప్‌లు

- 2029కల్లా 50వేల కొత్త ఉద్యోగాల కల్పన
- ఎవిజిసి-ఎక్స్ఆర్ విధానాన్ని ఆమోదించిన కేరళ కేబినెట్

తిరువనంతపురం : యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాల్టీ (ఎవిజిసి-ఎక్స్ఆర్) విధానాన్ని కేరళ కేబినెట్ బుధవారం ఆమోదించింది. ఈ విధానం కింద ఇటువంటి 250 కంపెనీలను నెలకొల్పి, విస్తరించాలన్నది ప్రభుత్వ లక్షంగా వుంది. 2029 నాటికల్లా ఈ రంగంలో కొత్తగా 50వేల ఉద్యోగాలను సృష్టించాలని భావిస్తున్నారు. దీని ద్వారా ఎవిజిసి-ఎక్స్ఆర్ పరిశ్రమలో భారతదేశ ఎగుమతి ఆదాయాల్లో 10శాతం వాటా రాష్ట్రానికి వుండాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రంగంలో అభివృద్ధి సాధించేందుకు కేరళ స్టార్టప్ మిషన్, కేరళ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్, కేరళ డిజిటల్ యూనివర్శిటీ, కేరళ రాష్ట్ర చలనచిత్రాభివృద్ధి సంస్థ, కేరళ టెక్నికల్ యూనివర్శిటీ, కేరళ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇమేజింగ్ టెక్నాలజీ, కేరళ డెవలప్‌మెంట్ ఇన్నొవేషన్ స్ట్రాటజీ కౌన్సిల్, కేరళ నాలెడ్జ్ ఎకనామీ మిషన్‌లు సంయుక్తంగా కృషి చేయనున్నాయి. స్టార్టప్ మిషన్ ప్రారంభిస్తున్న టెక్నాలజీ హబ్‌ను కూడా విస్తరించనున్నారు. ఈ రంగానికి సంబంధించిన సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ (సిఓఇ)ని కూడా తిరువనంతపురంలో ప్రారంభిస్తారు. నైపుణ్యాల అభివృద్ధికి, కొత్త కొత్త ఆవిష్కరణలు, వినూత్న పరిశోధనలు, అభివృద్ధికి ఈ సెంటర్ ఒక చుక్కానిలా వ్యవహరిస్తుంది. ఎవిజిసి-ఎక్స్ఆర్ ల్యాబ్‌ల డిజిటల్ పోస్ట్ ప్రొడక్షన్‌కు ఈ సిఓఇ అవసరమైన మౌలిక సదుపాయాలను అందచేస్తుంఇ. మోషన్ కేప్చర్, 2డి, 3డి యానిమేషన్ వంటి పోస్ట్ ప్రొడక్షన్ సాంకేతికతలను, హై స్పీడ్ రెండరింగ్‌తో పాటూ ఇతర సదుపాయాలను అందచేస్తుంది. కొత్తగా తలెత్తే ధోరణులపై దృష్టి పెడుతూ పరిశ్రమలోని నిపుణులతో భాగస్వామ్యం కలిగి పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు చేపడుతుంది. ఈ రంగంలో పారిశ్రామికాభివృద్ధికి రూ.200కోట్ల నిధులు కేటాయిస్తారు. పరిశోధనకు రూ.50కోట్లను అందచేయనుంది. ఈ రంగంలోని కళాకారులతో సహకార సంస్థలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

తొలి ఎఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'డెవిన్'

న్యూఢిల్లీ : సాంకేతిక ప్రపంచంలో సరికొత్త సంచలనం.. కృత్రిమ మేధ (ఎఐ) ప్రతి రంగంలోనూ అడుగుపెడుతోంది. యాంకర్‌గా మారి వార్తలు చదవడం దగ్గర నుంచి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించడం లాంటి ఎన్నో పనులు చేసేస్తోంది. తాజాగా ఎఐ సహాయంతో రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వచ్చేసింది. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి ఎఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా భావిస్తున్నారు. అమెరికాకు చెందిన టెక్ కంపెనీ కాగ్నిషన్ ఎఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'డెవిన్' రూపొందించింది. ఎఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఆవిష్కరించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని కంపెనీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. 'డెవిన్' అత్యాధునికమైనదని, ప్రముఖ ఎఐ కంపెనీల నుంచి ప్రాక్టికల్ ఇంజనీరింగ్ ఇంటర్వ్యూలను విజయవంతంగా పూర్తి చేసిందని తెలిపింది. "ఒక ప్రాంప్ట్ ఇస్తే చాలు అలవోకగా కోడ్ రాసేస్తుంది. వెబ్‌సైట్లను క్రియేట్ చేస్తుంది. సాఫ్ట్‌వేర్‌ను సృష్టిస్తుంది" అని కంపెనీ పేర్కొంది.

తుస్సుమన్న జపాన్ ప్రైవేట్ రాకెట్



టోక్యో : జపాన్ మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ కైరోస్ తుస్సుమంది. బుధవారం ప్రయోగించిన మరు క్షణమే నిప్పులు చిమ్ముతూ పేలిపోయింది. కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి ప్రభుత్వ ఉపగ్రహాన్ని తీసుకెళుతున్న ఈ రాకెట్ సెంట్రల్ జపాన్‌లోని వాకయామా ప్రిఫెక్చర్‌లో రాకెట్ లాంచింగ్ పాడ్ నుండి ప్రయోగించారు. దీంతో లాంచింగ్ పాడ్ ఏరియా అంతా నల్లని దట్టమైన పొగ కమ్ముకుంది. కొన్ని చోట్ల మంటలు చెలరేగాయి. ఈ వైఫల్యానికి గల కారణాలేమిటో తెలుసుకునేందుకు దర్యాప్తు జరిపిస్తున్నామని పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కె తెలిపింది.

టోక్యోకి చెందిన స్టార్టప్ కంపెనీ స్పేస్ వన్ ఈ రాకెట్‌ను రూపొందించి, ప్రయోగించింది.. ఇప్పటికే ఈ ప్రయోగం అనేకసార్లు వాయిదా పడుతూ వచ్చింది.

పార్టీ నామినేషన్లను గెలుచుకున్న బైడెన్, ట్రంప్

- నాలుగు రాష్ట్రాల్లో కీలక ప్రైమరీల్లో విజయం



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు వరుసగా డెమోక్రటిక్, రిపబ్లిక్ పార్టీల నామినేషన్లను గెలుచుకుని నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి అమీతుమీకి సిద్ధమవుతున్నారు. మంగళవారం జరిగిన మరో కీలకమైన ప్రైమరీలో ఇరువురూ విజయం సాధించడంతో వారి పార్టీ నామినేషన్లు ఖరారయ్యాయి. బైడెన్‌కు ఇప్పటికే 3,933 మంది ప్రతినిధుల మద్దతు వుంది. డెమోక్రటిక్ పార్టీ నామినేషన్ పొందాలంటే మొత్తంగా 1968మంది ప్రతినిధుల మద్దతు అవసరం. నాలుగు రాష్ట్రాలైన జార్జియా, హవాయి, మిస్సిసిపి, వాషింగ్టన్‌ల్లో, ఒక అమెరికన్ ప్రాంతంలో మంగళవారం ప్రైమరీలు జరిగాయి. ఆగస్టులో చికాగోలో జరిగే డెమొక్రటిక్ పార్టీ జాతీయ సదస్సులో బైడెన్ నామినేషన్‌ను లాంఛనంగా ప్రకటిస్తారు. మరోవైపు వాషింగ్టన్ ప్రైమరీలో గెలుపుతో ట్రంప్‌కు కూడా అవసరమైన 1215 ప్రతినిధుల మద్దతు పొందారు. జులైలో జరిగే రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సులో ట్రంప్‌ను అధికారిక అభ్యర్థిగా ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో తిరిగి 2020 నాటి పరిస్థితులే పునరావృతమవుతాయని భావిస్తున్నారు. 2020నాటి ఎన్నికల్లో బైడెన్, ట్రంప్‌ను ఓడించారు. కాగా మరోవైపు మార్చి 25న న్యూయార్క్‌లో ఒక క్రిమినల్ కేసులో ట్రంప్ విచారణను ఎదుర్కోనాల్సి వుంది. ఇలా విచారణను ఎదుర్కొనే మొదటి మాజీ అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్‌నే. డెమోక్రటిక్ నామినీగా ఆవిర్భవించడానికి బైడెన్ పెద్దగా వ్యతిరేకతను ఎదుర్కొనలేదు. కాగా అనేక ప్రైమరీల్లో పలువురు రిపబ్లికన్ అభ్యర్థులను ట్రంప్ ఓడించారు.

ఫుకుషిమా అణు వ్యర్థ జలాలపై మరింత లోతైన పరిశీలన

- ఐఎఇఎ చీఫ్ వెల్లడి

టోక్యో : జపాన్ అణు విద్యుత్ కేంద్రం ఫుకుషిమా నుంచి విడుదలవుతున్న అణు కలుషిత వ్యర్థజలాలపై మరింత లోతైన పరిశీలన జరపనున్నట్లు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) చీఫ్ రాఫెల్ గ్రాసీ చెప్పారు. వసునామీ కారణంగా దెబ్బ తిన్న ఫుకుషిమా అణు విద్యుత్ కర్మాగారం నుంచి ప్రమాదకరమైన అణు కలుషిత వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జపాన్ చుట్టు పక్కల దేశాల నుంచి కూడా ఫిర్యాదులు రావడంతో ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాసీ మూడు రోజుల పర్యటన కోసం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, అణు వ్యర్థాలపై మరింత లోతైన పరిశీలన జరపాల్సి ఉంటుందన్నారు.

ఫుకుషిమా ఉపద్రవానికి ఈ నెల 11వ తేదీకి 13ఏళ్లు పూర్తయింది. అణు ధార్మికతతో కలుషితమైన జలాలను దాదాపు దశాబ్ద కాలం పాటు ప్రక్షాళన, శుద్ధి కార్యక్రమాలు కొనసాగించిన తర్వాత ఆ జలాలను పెద్ద మొత్తంలో సముద్రంలోకి విడిచిపెడుతోంది.గత నెలలో టెప్కో నాల్గవ విడత అణు కలుషిత వ్యర్థ జలాలను పసిఫిక్ మహా సముద్రంలోకి విడుదలజేసింది.

ఇసిల నియామకంపై అత్యవసర విచారణ

- 15న విచారించేందుకు సిజెఐ నిర్ణయం
- సెలక్షన్ కమిటీ సమావేశంపై అధిర్ రంజన్ చౌదరి లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇసి), ఇసి నియామకాల అంశం మరోసారి వివాదానికి దారితీసింది. నియామకాల కోసం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్ల అత్యవసర విచారణ చేపట్టాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) తాజాగా అభ్యర్థించింది. ఇందుకు అంగీకరించిన కోర్టు ఈ నెల 15న విచారణ జరుపుతామని వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘం లో ఖాళీ అయిన కమిషనర్ల పోస్టులను ఈ నెల 15వ తేదీలోగా భర్తీ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్న వేళ.. ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెల ఒక కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. ఈ క్రమంలోనే ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది. ప్రధాని మోడీ, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి, కేంద్ర మంత్రి సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ మార్చి 15లోగా కొత్త కమిషనర్ల పేర్లను ఖరారు చేయనున్నారు. తాజా నియామకాలను సవాల్ చేస్తూ ఇటీవల కాంగ్రెస్ నేత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని కూడా శుక్రవారం విచారించనుంది.

22,217 ఎన్నికల బాండ్ల జారీ

- సుప్రీంకోర్టులో ఎస్‌బిఐ అఫిడవిట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2019 ఏప్రిల్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 15 వరకు సుమారు 22,217 ఎలక్టోరల్ బాండ్లను జారీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తెలిపింది. దీంట్లో ఇప్పటికే 22,030 బాండ్లను రిడీమ్ చేశారని వెల్లడించింది.ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ కుమార్ ఖరా అఫిడవిట్ దాఖలు చేశారు. అలాగే, ఎన్నికల బాండ్లపై డేటాను కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు కోర్టుకు ఎస్‌బిఐ తెలిపింది. ఇసికి పెన్‌డ్రైవ్‌లో ఆ సమాచారాన్ని చేరవేసినట్లు ఎస్‌బిఐ పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 12న పని వేళలు ముగిసేలోపు ఎన్నికల కమిషన్‌కు ఎలక్టోరల్ బాండ్ల వివరాలను అందుబాటులో ఉంచినట్లు ఎస్‌బిఐ తెలిపింది. ప్రతి ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసిన తేదీ, కొనుగోలుదారు పేర్లు, విరాళాలు అందుకున్న రాజకీయ పార్టీల పేర్లు, కొనుగోలు చేసిన బాండ్ల డినామినేషన్‌తో సహా వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి అందించినట్లు పేర్కొంది.

ఫిబ్రవరి 15న వెలువరించిన ఒక మైలురాయి తీర్పులో, ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అనామక రాజకీయ నిధులను అనుమతించే ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేసింది. దీనిని "రాజ్యాంగ విరుద్ధం" అని పేర్కొంది. దాతలు, గ్రహీతలు విరాళంగా ఇచ్చిన మొత్తాన్ని బహిర్గతం చేయాలని ఆదేశించింది.



సమావేశమైన ఎస్‌కెఎం సమన్వయ కమిటీ నేతలు

నేడు కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్

- దేశవ్యాప్తంగా వేలాది మంది హాజరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నేడు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతృత్వంలో కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్ ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదాన్‌లో జరగనుంది. ఈ మహా పంచాయత్ లో పాల్గొనేందుకు వేలాది మంది రైతులు, రైతు కూలీలు, గ్రామస్థులు బుధవారం సాయంత్రానికే ఢిల్లీకి చేరుకున్నారు. మహాపంచాయతీ జరిగే ప్రాంతంలో సన్నాహాలు పూర్తి అయ్యాయి. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల నుంచి వందలాది ట్రాక్టర్లు, ట్రాలీలు ఢిల్లీకి చేరుకున్నాయి. రైళ్లలో కూడా వేలాది మంది ఢిల్లీకి చేరుకున్నారు. ఎస్‌కెఎంకు చెందిన ఆయా సమన్వయ కమిటీలు, సబ్‌కమిటీలు బుధవారం సమావేశమై అన్ని సన్నాహాలు, ఏర్పాట్లను పూర్తి చేశాయి. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక, వ్యవసాయ కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, ప్రజాస్వామిక సంఘాల వంటి ఎస్‌కెఎం సమన్వయ సంఘాలతో సహా దేశంలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలకు సంయుక్త కిసాన్ మోర్చా విజ్ఞప్తి చేస్తుంది. దాన్ని తీసుకుని ఈ చారిత్రాత్మక మహాపంచాయత్‌ని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు.

బాండ్ల దెబ్బకు 'బేర్'

(మొదటిపేజీ తరువాయి)

రూపాయల నుండి 747 రూపాయలకు పడిపోయాయి. పేటియం, అదాని పవర్ సహా 1,010 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకడం గమనార్హం.

పతనం ఇలా...

మొత్తం మీద సెన్సెక్స్ బుధవారం అమ్మకాల ఒత్తిడితో 906 పాయింట్లు లేదా 1.23 శాతం క్షీణించి 72,762కు దిగజారింది. ఇంట్రాడేలో 1300 పాయింట్లు మేర పతనమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 338 పాయింట్లు లేదా 1.5 శాతం కోల్పోయి 21,998 వద్ద ముగిసింది. బిఎస్ఇలో 290 షేర్లు మాత్రమే రాణించగా.. 3,202 స్టాక్స్ పతనాన్ని చవి చూశాయి. మరో 38 సూచీలు యథాతథంగా నమోదయ్యాయి. సెన్సెక్స్ 30లో ఐటిసి, ఐసిఐసిఐ బ్యాంక్, కొటాక్ మహీంద్రా బ్యాంక్, నెస్లే ఇండియా ఇండియా షేర్లు లాభపడ్డాయి.. రియాల్టీ, మీడియా, పిఎస్‌యు బ్యాంక్, టెలికాం, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్ రంగాలు 4-6 శాతం పతనమయ్యాయి. స్టాక్ మార్కెట్లలో చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు బుడగల్లా పెరుగుతున్నాయని, ఇవి సహేతుకంగా లేవంటూ సెబీ చీఫ్ చేసిన వ్యాఖ్యలు ఈ పతనానికి కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బాటు మహాదేవ్ బెట్టింగ్ యాప్‌పై ఇడి చేస్తున్న దర్యాప్తు కూడా మరో కారణమని అంటున్నారు.

నోరుమెదపరేం?

(మొదటిపేజీ తరువాయి)

ఎండగట్టిన బిజెపితో టిడిపి, జనసేన కూటమి కట్టి ఓట్లడిగే హక్కు కోల్పోయారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మన రాష్ట్రంలో ఎవరు గెలిచినా మోడీ చెప్పు చేతల్లోకే జగన్, చంద్రబాబు, పవన్ వెళ్తారని, ఇది రాష్ట్రానికి తీవ్ర వినాశకరమని శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్... నవరత్నాల కోసం రూ.2.60 లక్షల కోట్లు ఇచ్చామంటూ అరిగిపోయిన రికార్డు మాదిరిగా పదేపదే చెబుతున్నారని, ఇచ్చిన దానికంటే నాలుగు రెట్లు విద్యుత్ ఛార్జీలు, ఇసుక, జిఎస్‌టి, చెత్త, ఆస్తి పన్నుల రూపంలో ప్రజలపై భారాలు మోపి రూ.లక్షల కోట్లు లాగడం నిజం కాదా? అని ప్రశ్నించారు.

ఇండియా వేదికకే ఆ సత్తా ఉంది...

దేశంలో పలు రాష్ట్రాల్లో మోడీ గ్రాఫ్ పడిపోతోందని వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రానికి అన్ని విధాలా నష్టం చేసే బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఓడించే సత్తా ఏకైక ప్రత్యామ్నాయం సిపిఎం, సిపిఐ, వామపక్ష, లౌకిక శక్తులతో ఏర్పాటైన 'ఇండియా వేదికకే ఉందని అన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ప్రాంతీయ సభలో 12 పార్టీలు పాలుపంచుకున్నాయని తెలిపారు. 2024లో దేశంలో మోడీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని, లౌకిక విలువలను దహించి వేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ శక్తులను రాష్ట్రంలో ప్రజలు ఆదరించాలని, సిపిఎం, సిపిఐ, ఇతర లౌకిక పార్టీల ఇండియా వేదికకు విజయాన్ని అందించాలని కోరారు.

అరకు పార్లమెంట్, అరకు, గాజువాక అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం పోటీ : లోకనాథం

ఉమ్మడి విశాఖ జిల్లాలో అరకు పార్లమెంట్, అరకు, గాజువాక అసెంబ్లీ స్థానాల నుంచి సిపిఎం పోటీ చేయనున్నట్లు కె.లోకనాథం తెలిపారు. బిజెపి ప్రభుత్వం నుంచి విశాఖ ఉక్కును రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అటవీ ప్రాంత రక్షణకు, గిరిజన హక్కుల పరిరక్షణకు అనేక రూపాల్లో తమ పార్టీ నికరంగా ఉద్యమిస్తోందని తెలిపారు. బిజెపిని, ఆ పార్టీకి సహకరిస్తోన్న రాజకీయ పార్టీలను ఈ ప్రాంతాల నుంచి తరిమికొట్టాలని, సిపిఎం అభ్యర్థులను చట్టసభలకు పంపాలని ప్రజలను కోరారు.

రేగుచెట్టు స్నేహం



సలిల ఆ రోజే ఆ స్కూల్లో ఎనిమిదో తరగతిలో చేరింది. వాళ్ల నాన్నగారికి ఆ ఊరికి బదిలీ కావడంతో ఆ ఊరు వచ్చి మూడు రోజులే అయ్యింది. స్కూలు అయిపోయాక ఇంటికెళుతూ ఆమె దృష్టి అనుకోకుండా ఓ ఇంటి వెనకాల వున్న ఒక రేగుచెట్టు మీద పడింది. వత్తుగా ఆకులతో బుజ్జిగా ఇంచుమించు తనంత ఎత్తులోనే వున్న ఆ చెట్టుని చూస్తూనే సలిలకి ఎందుకో చాలా ఇష్టం కలిగింది. దాని దగ్గర ఆగి, దాని ఆకుల్ని వేళ్లతో వీణ తీగెల్ని మీటినట్టు సుతారంగా తాకింది. దానికి 'బై' చెప్పి అక్కడి నుండి కదిలింది. ఆ రోజు నుండి ఎంత హడావుడిలో వున్నా కనీసం కళ్లతో అయినా ఆ చెట్టుని పలకరిస్తుంది సలిల.

ఒకసారి చాలా రోజుల నుండి ఎండలు విరగకాస్తున్నాయి. చాలా మొక్కలు వాడిన ఆకులతో దీనంగా కనిపిస్తున్నాయి. ఓ రోజు సలిల తన స్కూలు బ్యాగులో వున్న నీళ్లసీసాలో తాగగా మిగిలిపోయిన నీళ్లని రేగుచెట్టు మొదట్లో వేసింది. కొన్ని చుక్కల్ని దాని ఆకుల మీద చిలకరించింది. ఆ చెట్టు పులకరించినట్టు చిరుగాలికి చిత్రంగా కదిలింది. దాన్ని చూసి సలిలకి ఎంతో సంతోషం కలిగింది.

రోజు రోజుకి ఆ మొక్క అంటే సలిలకి ఇష్టం పెరిగిపోయింది. సలిలతో పాటు రేగుచెట్టూ ఎదుగుతోంది. ఇప్పుడు సలిల ఇంటర్‌కి వచ్చింది. నాన్నగారు ఆమెని విజయవాడలో ఓ కాలేజీలో చేర్పించారు. చదువు కాలేజీలో. వసతి హాస్టల్‌లో. ఇక వేరే ప్రపంచం లేదు. సలిలకి అప్పుడప్పుడూ రేగుచెట్టు గుర్తుకొచ్చేది. సెలవులకి ఇంటికొచ్చినప్పుడు, పని గట్టుకుని వెళ్లి కొంతసేపు ఆ చెట్టును చూసి వచ్చేది. ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చాయి. ప్రవేశ పరీక్షలో కూడా మంచి ర్యాంకు వచ్చి ఖరగ్‌పూర్ ఐ.ఐ.టి.లో చేరింది సలిల.

ఇప్పుడు చదువు పూర్తి అయ్యి, ఇటలీలో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తన రూం కిటికీ నుండి చూస్తే ఎన్నో అందమైన చెట్లు కనిపిస్తాయి. కాని తన చిన్ననాటి ఆ ముళ్ల రేగుచెట్టు గుర్తుకొస్తూనే వుంటుంది సలిలకి.

ఓ సంవత్సరం సంక్రాంతి పండక్కి సెలవుపెట్టి ఇంటికొచ్చింది సలిల. స్కూటీని తీసుకొని 'రైయ్'మని రేగుచెట్టు దగ్గరికి వెళ్లిపోయింది. దానితో బోలెడు ఊసులాడింది. చెట్టు నిండా రేగుపళ్లు. కొన్ని కోసుకుని ఇష్టంగా తింది. కొంతసేపయ్యాక వెనుదిరిగింది. అక్కడి నుండి కదిలే లోగా ఆ చెట్టుతో సెల్ఫీ దిగింది. దాన్ని హోమ్ స్క్రీన్‌గా పెట్టుకుంది. విదేశంలో తన ఒంటరితనపు దిగులును దాన్ని చూస్తూ జయిస్తుంది. ఆ ఫోటోను చూస్తుంటే ఆమెకు ఎక్కడలేని ఉత్సాహం కలుగుతుంది. అమ్మా, నాన్నలతో స్వంత ఊళ్లో ఉన్నట్టు అనిపిస్తుంది.

- ఎస్. హనుమంతరావు
8897815656

నేను గీసిన బొమ్మ



బి.లిఖిత్ శంకర్
5వ తరగతి,
ఎంపిపిఎస్
చటాకాయి,
కైకలూరు మండలం
ఏలూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రంజాన్ వేళ.. ఆహార జాగ్రత్తలు

మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ మాసంలో చాలామంది ఉపవాసం పాటిస్తారు. ఉపవాసం ప్రారంభించే సూర్యోదయానికి ముందు సెహ్రీని, సాయంత్రం ఇఫ్తార్ అంటారు. ఉదయం వేళ పాటించే సెహ్రీ సమయంలో ఏయే ఆహార పదార్థాలు తీసుకోవాలి, తీసుకోకూడదో ఒకసారి చూద్దాం.



తృణధాన్యాల అల్పాహారం : సెహ్రీ సమయంలో తృణధాన్యాల అల్పాహారం తినకూడదు. వాటిల్లో శరీరానికి కావాల్సిన దానికంటే చాలా ఎక్కువ షుగర్ ఉంటుంది. కాబట్టి ఉపవాసం ప్రారంభించే ముందు ఈ పదార్థాలు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. ఆరోగ్యానికి ఇది మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

వేయించిన ఆహారం : చికెన్ ఫ్రై, సమోసా, పకోడీలు లేదా చిప్స్ లాంటి పదార్థాలు అసలు తినకూడదు. దీని వల్ల కడుపు ఉబ్బరం, అజీర్తి, ఎసిడిటీ వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెర పానీయాలు : శీతల పానీయాలు, సోడా వంటి వాటి జోలికి వెళ్లకపోవడం మంచిది. అవి అధిక చక్కెరను కలిగి ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచుతాయి. అంతేకాక, వీటిని తాగడం ద్వారా రోజంతా ఆకలి, ఎదుర్కోవలసి ఉంటుంది.

అధిక కొవ్వు కలిగిన ఆహారం : పిజ్జా, బర్గర్, చీజ్ మొదలైన కొవ్వు పదార్థాలు కూడా తినకూడదు. ఇవి అజీర్తికి కారణమవుతుంది. జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది కాబట్టి, రోజంతా అసౌకర్యంగా ఉండవచ్చు.

స్పైసీ ఫుడ్ : స్పైసీ ఆహారాన్ని తినడం వల్ల కడుపు, ఛాతీలో మంట వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల లైట్ ఫుడ్‌ను తీసుకోవడం మంచిది.

టీ, కాఫీ వద్దు : సెహ్రీ సమయంలో కెఫిన్ ఉన్న వస్తువులను కూడా తీసుకోకూడదు. ఇది శరీరంలో నిర్జలీకరణానికి కారణమవుతుంది. రోజంతా దాహంతో బాధపడవచ్చు. టీ లేదా కాఫీని ఎక్కువగా తీసుకుంటే అవి శరీరం నుంచి నీటిని పీల్చుకుంటాయి.

ఏం తినాలి?

✧ ఉపవాసం ఉండాలంటే ముందుగా సెహ్రీ పూర్తి చేయాలి. తక్కువ కాలరీలు ఉన్న ఆహారం తీసుకోవడం ఉత్తమం. రోజంతా ఉల్లాసంగా ఉండేలా, నీరసం రాకుండా ఉండే తాజా ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

✧ ఇక ఇఫ్తార్ సమయంలో అంటే ఉపవాసం విడిచే సమయంలో తప్పకుండా తినాలి. వాస్తవానికి ఆ సమయంలో ఎక్కువ నీటి అవసరం ఉంటుంది. అందుకే ఇఫ్తార్ సమయంలో నిమ్మకాయ రసం లేదా కొబ్బరి నీళ్లు కచ్చితంగా తాగాలి. టీ లేదా కాఫీకి దూరంగా ఉంటే మంచిది.

✧ పప్పులు, బీన్స్, లీన్ మీట్, చేపలు, పాల ఉత్పత్తులు, గుడ్లు తినవచ్చు. ఇందులో ప్రోటీన్లు పెద్దమొత్తంలో ఉండటం వల్ల ఆరోగ్యానికి ప్రయోజనకరం. పండ్లు, గుప్పెడు డ్రైఫ్రూట్స్ లేదా సలాడ్ స్నాక్గా కూడా తీసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఖనిజ పదార్థాలు, ఫైబర్ నిండిన డైట్ తీసుకుంటే ఆరోగ్యానికి లాభదాయకం.

✧ ఇఫ్తార్ సమయంలో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం మంచిది. దీనివల్ల దీర్ఘకాలం ఎనర్జీ లభిస్తుంది. దాంతోపాటు ఫైబర్, ఖనిజ పదార్థాలు అధికంగా ఉండే పదార్థాల్ని డైట్‌లో చేర్చుకోవాలి.

✧ వేర్వేరు రంగుల కూరగాయల్ని తినాలి. ఇందులో విటమిన్లు, ఖనిజ పదార్థాలు, ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అదే సమయంలో కేలరీలు తక్కువగా ఉంటాయి.

✧ హై కేలరీ, పంచదార నిండిన పదార్థాలు, నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. లేకపోతే జీర్ణక్రియపై ప్రభావం చూపిస్తాయి. గ్యాస్ట్రిక్ సమస్య ఉత్పన్నం కావచ్చు. కాబట్టి ఉపవాసం వేళ తగినన్ని జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

కోవిడ్ ప్రభావం కొనసాగుతూనే ఉంది!



ప్రపంచం, కోవిడ్ ముప్పు నుండి బయటపడి చాలా కాలమైంది. కానీ ఇప్పటికీ ఎక్కడో ఓ చోట కోవిడ్ తాలూకు భయాలు, దాని చుట్టూ అల్లుకున్న సర్వేలు మనల్ని హెచ్చరిస్తూనే ఉంటున్నాయి. తాజాగా ప్రముఖ సైన్స్ పత్రిక లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించిన ఓ సర్వే వివరాలు చూస్తే, కోవిడ్ కాలంలో అంటే 2019 - 21 మధ్య కాలంలో ప్రపంచ జనాభా జీవితకాలం 1.6 సంవత్సరాల క్షీణత లోనైంది.

కోవిడ్ విస్తృతంగా వ్యాపించిన మొదటి రెండు సంవత్సరాల కాల వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థలు పరిగణనలోకి తీసుకుని ఈ అధ్యయనాన్ని వెల్లడించారు. ఈ సర్వే ప్రపంచవ్యాప్తంగా వృద్ధాప్య జనాభా పెరుగుదలను కూడా సూచించింది. ప్రపంచ మొత్తం దేశాల్లో 84 శాతం దేశాలు, భూభాగాల్లో ఆయుర్దాయం క్షీణించడానికి ఇది కూడా ఒక కారణంగా సర్వే తేల్చింది.

2020–21 కోవిడ్ సమయంలో సంభవించిన మరణాల్లో వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు లాన్సెట్ అధ్యయన పరిశోధకులు చెబుతున్నారు. ఇదే సందర్భంలో ఐదేళ్ల లోపు పిల్లల మరణాలు తగ్గినట్లు సర్వే చెబుతోంది. 2019తో పోల్చినప్పుడు 2021లో 50 వేల పిల్లల మరణాలు తగ్గాయని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మరణాల్లో ప్రతి నలుగురిలో ఒకరు దక్షిణాసియాలో నివసిస్తున్నారని, మరణించిన ప్రతి నలుగురు పిల్లల్లో ఇద్దరు సహారా ఆఫ్రికాలో జీవిస్తున్నారని సర్వే తేల్చింది. ప్రాంతాలను బట్టి పిల్లల మరణాల్లో తేడాలున్నట్లు పరిశోధకులు పేర్కొన్నారు. ఈ అంచనాలు కోవిడ్–19, భవిష్యత్తులో దాని పరిణామాలపై లోతైన అధ్యయనాలు చేయడానికి దోహదపడ తాయని నిపుణులు తెలిపారు. ఇన్స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ (ఐహెచ్‌ఎంఈ), యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ (ఐబో), ఖా సమన్వయంతో పరిశోధన, గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ (+జీబీడి) 2021 నుండి నూతనీకరించిన అంచనాలను సర్వేలో సమర్పించారు.

కోవిడ్–19 రెండు సంవత్సరాల కాల వ్యవధిలో 2019 నుండి 15 సంవత్సరాలు పైబడి ఉన్న వారిలో ప్రపంచ మరణాల రేటు పురుషుల్లో 22 శాతం, మహిళల్లో 17 శాతం పెరిగిందని పరిశోధకులు అంచనా వేశారు.

2020–21లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ప్రజలు వివిధ కారణాల వల్ల మరణించారు. ఇందులో కోవిడ్ కోటి 60 లక్షల మిలియన్ల మంది మరణాలకు కారణమైంది. ఈ మరణాలు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా, సామాజిక, ఆర్థిక కారణాల పరంగా అంచనా వేశారు.

జోర్డాన్, నికరాగ్వా వంటి స్వల్ప మరణాల రేటు కలిగిన ప్రాంతాల్లో కూడా కోవిడ్ సమయంలో అత్యధిక మరణాలు చోటుచేసుకున్నట్లు ఖ్యందం గుర్తించింది. అలాగే బార్బడోస్, న్యూజిలాండ్, ఆంటిగ్వా, బార్బుడా దేశాల్లో కోవిడ్ మరణాలు అత్యల్పంగా సంభవించినట్లు సర్వే వెల్లడించింది.

ఈ సందర్భంగా ప్రపంచ జనాభా పెరుగుదలను కూడా సర్వే అంచనా వేసింది. 2021లో ప్రపంచ జనాభా దాదాపు 7.9 బిలియన్లకు చేరుకుందని పరిశోధకులు కనుగొన్నారు. 204 దేశాల్లో 56 దేశాలు, భూభాగాలు ప్రపంచ జనాభాలో గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఆ తరువాత క్రమంగా తగ్గుముఖం పట్టిందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా 2017 నుండి జనాభా పెరుగుదలలో స్తబ్దత కనిపించింది. మహమ్మారి సమయంలో ఇది ఇంకా వేగవంతమైంది. తక్కువ ఆదాయాలు గల దేశాల్లో జనాభా పెరుగుదల వేగవంతమైనట్లు సర్వే గుర్తించింది. సబ్–సహారా ఆఫ్రికా (39.5శాతం), దక్షిణాసియా (26.3) శాతం పెరుగుదలను నమోదు చేసింది. 204 దేశాలు, భూభాగాల్లో 188 దేశాల్లో 15 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారి సంఖ్య కంటే ఇప్పుడు ప్రపంచ జనాభా 65 ఏళ్ల కంటే పైబడిన వారితో నిండిపోయిందని పరిశోధకులు తెలిపారు. ఈ సంఖ్యను బట్టి ప్రపంచవ్యాప్తంగా వృద్ధాప్య గణనీయంగా వృద్ధి చెందిందని సర్వే తేల్చింది.

21 రోజుల ఫుటేజ్ పోయింది..



రజినీకాంత్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం 'లాల్‌సలామ్'. ఈ మూవీలో విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఫిబ్రవరి 9న విడుదలైన ఈ చిత్రం ఆశించిన విజయం అందుకోలేదు. 'రజనీకాంత్ స్టార్‌డమ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆయన ప్రజెంటేషన్‌కు సంబంధించి స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులుచేర్పులు చేసి.. కమర్షియల్ ఎలిమెంట్స్‌ను యాడ్ చేశాం. ఈ మార్పులు సినిమా పరాజయానికి కారణమయ్యాయి' అని ఐశ్వర్య గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తాజాగా ఈ మూవీ పరాజయానికి సంబంధించి మరో విషయాన్ని వెల్లడించారు. ఈ మూవీకి ఫస్ట్ ఆఫ్‌కు సంబంధించిన 21 రోజుల ఫుటేజ్ కోల్పోయినట్లు ఐశ్వర్య వెల్లడించారు. 'క్రికెట్‌కు సంబంధించిన సన్నివేశాలను 20 కెమెరాలతో నిజమైన మ్యాచ్‌లా షూట్ చేశాం. మా దురదృష్టం కొద్దీ అది పోగొట్టుకున్నాం. మాకు ఏం చేయాలో అర్థం కాలేదు. అప్పటికే విష్ణు విశాల్, నాన్న (రజనీకాంత్) సహా మరికొంతమంది నటులు వేరే సినిమాల కోసం గెటప్‌లు మార్చుకున్నారు. అందుకే రీ షూట్ చేయలేకపోయాం. చివరికి మిగిలి ఉన్న దానితో సినిమాను ఎడిట్ చేశాం' ఈ ప్రభావం సినిమాపై గట్టిగా పడిందంటూ ఐశ్వర్య చెప్పారు.



'శరతులు వర్తిస్తాయి'కి క్లీన్ యు సర్టిఫికెట్

చైతన్యరావ్, భూమి శెట్టి జంటగా నటించిన 'శరతులు వర్తిస్తాయి' సినిమాకు సెన్సార్ ప్రశంసలు వచ్చాయి. కుమారస్వామి (అక్షర) దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై శ్రీలత–నాగార్జున సామల, శారద–శ్రీష్ కుమార్ గుండా, విజయ–డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈనెల 15న ఈ సినిమా విడుదల కానుంది. సెన్సార్ సభ్యులు క్లీన్ యు సర్టిఫికెట్ జారీచేశారు. మానవీయ విలువలు ఉన్న ఒక మంచి సినిమా రూపొందించారంటూ దర్శకుడు కుమారస్వామికి సెన్సార్ సభ్యులు అభినందలు తెలిపారు.

ఇళయరాజాను జీవితంలో మర్చిపోను

'చిన్నతనంలో సంగీతం అంటే ఏమిటో తెలియనప్పుడే ఇళయరాజా సంగీతం వింటుంటే అద్భుతంగా అనిపించేది. పరీక్షలకు చదువుకునే సమయంలోనూ ఆయన పాటలు వింటూ ఉండేవాడిని. ఆయన సంగీతంనాకు ప్రాణం. ఆయన స్ఫూర్తితోనే నేను సంగీత దర్శకుడిగా ఎదిగాను. సంగీత దర్శకుడయ్యాక నా స్టూడియోలో ఇళయరాజా పెద్ద ఫొటో పెట్టుకున్నాను. ఆయన ఒక్కరోజైనా నా స్టూడియోకు వచ్చి ఇక్కడ నిల్చుంటే కలిసి ఫొటో దిగాలని కలలు కన్నాను. ఈ రోజు నా కల నెరవేరింది. దీనిని జీవితంలో మర్చిపోలేను' అని సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారంనాడు ఆయన స్టూడియోను తెలుగు సంగీత దర్శకుల్లో అగ్రగామిగా ఉన్న ఇళయరాజా సందర్శించారు. ఈ సందర్భంగా ఆనందంతో దేవిశ్రీప్రసాద్ తన మనసులోని మాటలను సోషల్‌మీడియాలో ప్రస్తావించారు.





15న ట్రైలర్

శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఓం భీమ్ బుష్'. నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్ ఉపశీర్షిక. రీతువర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కావెడి ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాకు 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా మార్చి 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్స్ వేగం పెంచింది చిత్రయూనిట్. తాజాగా ఈ సినిమా నుంచి చిత్రబృందం ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ ట్రైలర్‌ను మార్చి 15న విడుదల చేయనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించింది. వి.సెల్యులాయిడ్‌తో కలిసి సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్ సంస్థ సమర్పిస్తోంది.

'ఫైటర్ రాజా' ఫస్ట్‌లుక్ విడుదల



రామ్స్, మాయా కృష్ణన్ ప్రధాన పాత్రల్లో కృష్ణప్రసాద్ దర్శకత్వంలో రనవే ఫిల్మ్స్ ప్రొడక్షన్ నం.2గా 'ఫైటర్‌రాజా' సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైంది. దినేష్ యాదవ్ బొల్లెబోయిన, పృథ్వి యాదవ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టైటిల్ ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీ విష్ణు ఆవిష్కరించారు. తనికెళ్ల భరణి, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ హాజరయ్యారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ ఫైటర్ రాజా సినిమా నటీనటులందరికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

రసపట్టులో రంజీ ఫైనల్

- విదర్భ లక్ష్యం 538, ప్రస్తుతం 248/5
- కరుణ్ నాయర్, అక్షయ్ పోరాటం
- కీలకంగా మారిన చివరిరోజు ఆట



శార్దూల్ ఠాకూర్‌ను అభినందిస్తున్న ముంబయి ఆటగాళ్లు

ముంబయి: విదర్భ–ముంబయి జట్ల మధ్య వాంఖడే స్టేడియంలో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ రసవత్తరంగా సాగుతోంది. 538పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ జట్టు నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 248పరుగులు చేసింది. విజయానికి విదర్భ జట్టు చివరిరోజైన గురువారం మరో 290పరుగులు చేయాల్సి ఉండగా.. మరో ఐదు వికెట్లు కూల్చితే ముంబయి విజయం సాధించనుంది. ఈ క్రమంలో విజయం కోసం ఇరు జట్లు హోరాహోరీగా పోరాడుతున్నాయి. ముంబయి నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నాలుగో రోజు 92ఓవర్లు ఆడి 5వికెట్లు కోల్పోయి 248పరుగులు చేసింది. ఓవర్ నైట్ స్కోరు 10 పరుగులతో నాల్గోరోజు ఆటను కొనసాగించిన విదర్భ.. తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించింది. ఓపెనర్లు అథర్వ తైడే(32), ధ్రువ్ షోరే(28)లు 18.5 ఓవర్ల పాటు నిలబడ్డారు. శామ్స్ ములానీ 19వ ఓవర్లో అథర్వను ఔట్ చేసి ముంబయికి తొలి బ్రేక్ ఇచ్చాడు. ఆ మరుసటి ఓవర్లోనే తనుష్ కొటియన్.. ధ్రువ్ వికెట్ తీసి విదర్భకు షాకిచ్చాడు. అమన్ మొఖడే(32) ఎక్కువసేపు క్రీజ్‌లో నిలువలేకపోయాడు. యశ్ రాథోడ్(7)ను ముషీర్ ఖాన్ ఔట్ చేశాడు. 133 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన విదర్భను కరుణ్ నాయర్ తో పాటు కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (91 బంతుల్లో 56 నాటౌట్) ఆదుకున్నాడు. కరుణ్ నాయర్.. 220 బంతుల్లో 74పరుగులు చేశాడు. ఐదో వికెట్‌కు అక్షయ్‌తో కలిసి 90 పరుగులు జోడించాడు. నాలుగో రోజు మరో ఐదు ఓవర్లలో ముగుస్తుందనగా ముషీర్ ఖాన్.. విదర్భను మరోసారి దెబ్బతీశాడు. కరుణ్ నాయర్‌ను అతడు పెవిలియన్‌కు పంపాడు. దీంతో విదర్భ ఐదో వికెట్ కోల్పోయింది. క్రీజ్‌లో అక్షయ్ వాడ్కర్(56)తో పాటు హర్ష్ దూబే(11) ఉన్నారు. చివరిరోజైన విదర్భ గెలుపు అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్ ఎలాంటి మలుపులు తిరుగుతుందోనని ఆసక్తికరంగా మారింది. ఇక ముంబయి జట్టు రికార్డుస్థాయిలో 41సార్లు ఈ టైటిల్‌ను చేజిక్కించుకోవడంతో పాటు వరుసగా 15సార్లు టైటిల్‌ను చేజిక్కించుకున్న చరిత్ర కలిగి ఉండగా.. విదర్భ జట్టు మాత్రం రెండుసార్లు మాత్రమే ఈ ట్రోఫీని సాధించింది.

ఫైనల్‌కు ఢిల్లీ

- గుజరాత్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
- ముగిసిన డబ్ల్యుపిఎల్ లీగ్ మ్యాచ్‌లు



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్–2 ఫైనల్లోకి ఢిల్లీ క్యాపిటల్స్ మహిళలజట్టు దూసుకెళ్లింది. ఆరంభంలో గుజరాత్ జెయింట్స్‌తో బుధవారం జరిగిన చివరిలీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు ఏడు వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్ మహిళల జట్టును చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 126పరుగులకే పరిమితం కాగా.. ఆ లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు 13.1ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 129పరుగులు చేసి ఛేదించింది. షెఫాలీ వర్మ(71; 37బంతుల్లో 7ఫోర్లు, 5సిక్సర్లు) ధనా ధన్ బ్యాటింగ్‌తో రాణించగా.. రోడ్రిగ్స్(38నాటౌట్) మ్యాచ్‌ను ముగించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షెఫాలీ వర్మకు లభించింది. అంతకుముందు టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను క్యాప్, జొన్నాసెన్ కట్టడి చేశారు. దీంతో గుజరాత్ జట్టు 16పరుగులకు టాపార్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో లిచ్‌ఫీల్డ్(21) కాస్త ఫర్వాలేదనిపించినా.. గార్డినర్(12) నిరాశపరిచింది. దీంతో గుజరాత్ జట్టు 48పరుగులకు సగం వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత భారతి(42), బ్రైస్(28నాటౌట్) ఆచి తూచి ఆడి గుజరాత్‌ను ఆదుకున్నారు. వీరిద్దరూ 6వ వికెట్‌కు 68పరుగులు జతచేశారు. ఆ తర్వాత గుజరాత్ మళ్లీ వరుసగా వికెట్లను కోల్పోయింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి ఆ జట్టు కేవలం 126పరుగులే చేయగలిగింది. క్యాప్, శిఖా పాండే, మిన్ను మణికి రెండేసి, జొన్నాసెన్‌కు ఒక వికెట్ దక్కాయి. గుజరాత్, యుపి మహిళల జట్లు ప్లే–ఆఫ్‌కు ఇప్పటికే నిష్క్రమించగా.. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి జట్లు ప్లే–ఆఫ్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో ఢిల్లీ జట్టు 12పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరగా.. ముంబయి–బెంగళూరు జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ 15న జరగనుంది.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా..)

గుజరాత్ జెయింట్స్ మహిళలు : ఫుల్మలి 42, బ్రైస్ (నాటౌట్) 28; క్యాప్ 2/17, మిన్ను మణి2/9)

ఢిల్లీ క్యాపిటల్స్ మహిళలు : షెఫాలీ వర్మ 71, రోడ్రిగ్స్(నాటౌట్) 38; తనూజ 2/20



సౌదీ లీగ్‌లో అల్–హిలాల్ జట్టు ప్రపంచ రికార్డు

వరుసగా 28 మ్యాచుల్లో గెలుపు

దుబాయ్: సౌదీ ప్రొ లీగ్‌లో అల్–హిలాల్ జట్టు ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ లీగ్‌లో వరుసగా 28మ్యాచుల్లో గెలుపొందిన తొలి జట్టుగా ఈ రికార్డును సాధించింది. సౌదీ ప్రొ లీగ్‌లో భాగంగా ఆసియా ఛాంపియన్స్ లీగ్ క్వార్టర్‌ఫైనల్లో అల్ హిలాల్ జట్టు 2–0తో అల్–ఇత్తిహాద్‌ను ఓడించింది. స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో ప్రాతినిధ్యం వహిస్తున్న అల్–నాసర్ జట్టు కంటే 12పాయింట్ల ఆధిక్యతలో జీసస్ ఉంది. 2022 న్యూఎర్ అల్–హిలాల్‌తో సెమీస్‌లో అల్–ఐన్ జట్టు తలపడనుంది. గతంలో 2016–17 సీజన్‌లో వేల్ప్ ప్రీమియర్ లీగ్‌లో ఛాంపియన్ షిప్‌లో జార్జి జీసస్ జట్టు 27 మ్యాచుల్లో నెగ్గి రికార్డు నెలకొల్పింది. అంతకుముందు 44ఏళ్ల క్రితం 26మ్యాచుల్లో గెలిచిన అజాక్స్ ఆమ్‌స్టర్‌డామ్ రికార్డును జీసస్ జట్టు ఎనిమిదేళ్ల క్రితం బ్రేక్ చేయగా.. తాజాగా అల్–హిలాల్ జట్టు ఆ రికార్డును చెరిపేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68